J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 22 01.11.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## నేతల చూపు.. జనసేన వైపు

# వైసీపీ ఖాళీ అవుతుందా?

"ముఖానికి రంగులేసుకునే వాళ్ళు రాజకీయం ఏం చేస్తారు"... నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శ ఇది. అదే రామారావు తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని పరిపాలించిన ఉత్తమ ముఖ్యమంత్రులలో తానూ ఒకడిగా ఖ్యాతి గడించారు. నేషనల్ ఫ్రంట్ అధ్యక్షుడిగా జాతీయస్థాయిలో తన సత్తా చాటారు. దక్షిణ భారతీయులంటే మదరాసీయులనే నానుడి మాసిపోయేలా తెలుగువారి కీర్తిని దేశమంతా ఇనుమడింపచేశారు. నాలుగు దశాబ్దాల క్రితం నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీయే ప్రస్తుతం విభజిత ఆంధ్ర రాష్ట్రంలో అధికారంలో ఉంది.

నందమూరి స్ఫూర్తితో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కూడా ఆంధ్ర రాజకీయ అరంగేట్రం చేశారు. మార్చి 14, 2014న జనసేన పార్టీని స్థాపించి ప్రత్యక్ష రాజకీయాలలో తన ఉనికిని చాటే ప్రయత్నం చేశారు. 2014లో ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయకుండా బీజేపీ – టీడీపీ లకి తన మద్దతు ప్రకటించారు. ఆ ఎన్నికలలో టీడీపీ విజయం సాధించింది. ఆ తరువాత రెండు పార్టీలతోనూ విభేదించిన పవన్ కళ్యాణ్ 2019, ఎన్నికలలో ఒంటరిగా బరిలో దిగారు. అయితే, దురదృష్టవశాత్తు ఆ ఎన్నికలలో ఒక్క స్థానంలో తప్ప తన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలతో పాటు

10లో




### లాయర్ మాటే నిజమైంది

# టీటీడీ ఛైర్మన్‌గా బి.ఆర్.నాయుడు

10లో

## 24 మందితో కొత్త పాలకమండలి

### సభ్యురాళ్ళుగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పనబాక లక్ష్మి









కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు

నిర్యాణం: 01-11-2013

## 11వ వర్ధంతి



అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

## అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి

ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కుమారుడు

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

నెల్లూరు లోక్‌సభ సభ్యులు



## చంద్రన్నకి.. దీపావళి శుభాకాంక్షలు

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 30వ తేదీ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి పండుగ శుభాకాంక్షలు చెప్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

### కార్తీక మాసంలో శైవక్షేత్రాలకు..

# నెల్లూరు నుంచి ప్రత్యేక బస్సులు

కార్తీకమాసం నేపథ్యంలో అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటల్లో ఉన్న పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేకబస్సులు నడుపుతోంది. నవంబరు 3 నుంచి 10వ తేది, 17, 24 తేదీల్లో పంచారామాలకు నెల్లూరు ప్రధాన బస్టాండు వద్ద నుంచి రాత్రి 9 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, సోమవారం వెళ్ళి మళ్లీ మంగళవారానికల్లా నెల్లూరుకు చేరుకుంటాయని, రానుపోను చార్జీ రూ. 2500గా నిర్ణయించామని నెల్లూరు 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. అదేవిధంగా నెల్లూరు నుంచి శ్రీశైలానికి 670 రూపాయల చార్జీతో, నవంబరు 3 నుంచి రోజూ రాత్రి 9.15 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు ఉంటుందని, అరుణాచలానికి నవంబరు 3, 9, 10, 14, 17, 24తేదీల్లోనూ, డిసెంబరు 1వ తేదీన కూడా నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు. దీనికి రానుపోను చార్జీ 1200 రూపాయలని ఆయన తెలిపారు.



### 'ఎన్టీఆర్ వైద్యసేవ' కోఆర్డినేటర్‌గా..

# డాక్టర్ సుధీర్‌కుమార్

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కోఆర్డినేటర్‌గా, ప్రస్తుతం జల్లా వైద్యఆరోగ్య శాఖలో స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ అధికారిగా ఉన్న డాక్టర్ సుధీర్‌కుమార్ నియమితులయ్యారు. ఆ స్థానంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ ప్రకాశం జిల్లాకు బదలీ అయిన నేపథ్యంలో, ప్రభుత్వం తాజాగా డాక్టర్ సుధీర్‌కుమార్‌ను నియమించింది. అక్టోబర్ 26న ఆయన కో-ఆర్డినేటర్ బాధ్యతలు స్వీకరించి, అనంతరం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

### రిజిస్ట్రేషన్ స్టాంపులకు

# ఇక దిగుల్లేదు

రిజిస్ట్రేషన్ స్టాంపులు లేక స్టాంప్ వెండర్ల వద్ద ఎక్కువ ధర పెట్టి తెచ్చుకునే బాధలేకుండా, ప్రభుత్వం తాజాగా జిల్లాకు కోటీ 20లక్షల విలువచేసే రూ. 50, రూ. 100 విలువలతో ఉండే నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌లను పంపింది. వాటిని జిల్లాలోని 15 సబ్‌రిజస్ట్రార్ కార్యాలయాలకు పంపిస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ వర్మ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజాసేవే.. పోలీసుల కర్తవ్యం

### 'ఓపెన్‌హౌస్'లో జిల్లా ఎస్పీ



ప్రజా సేవ, సమాజసేవే పరమార్ధంగా పోలీసులు సేవలందిస్తుంటారని, ప్రజలు పోలీసులు ఎల్లవేళలా స్నేహపూర్వక వాతావరణంలో సఖ్యతగా ఉండాలని, అందుకే ఓపెన్‌హౌస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా, అక్టోబర్ 26న నెల్లూరులోని పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పోలీసులు ఉపయోగిస్తున్న తుపాకులు, తదితర ఆయుధాలను వాటి పనితీరును ఆయన ఈ సందర్భంగా వారికి వివరించారు. బాంబ్ డిస్పోజల్ పరికరాలు, డాగ్‌స్క్వాడ్‌లు ఏ విధంగా పనిచేస్తాయో వివరించారు. విపత్తుల సమయంలో పోలీసులు ప్రాణాలకు తెగించి ఎలా విధులు నిర్వహిస్తారో తెలిపారు. పోలీసు అమరవీరుల సేవలను ఆయన జ్ఞాపకం చేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని జీవితంలో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు ఏఎస్పీలు సౌజన్య, మునిరాజా పాల్గొన్నారు.

# ఉచిత గ్యాస్..వచ్చేసింది

తెల్ల రేషన్‌కార్డులున్నోళ్ళకి శుభవార్త. ఎన్నికలప్పుడిచ్చిన హామీని నెరవేరుస్తూ, తెలుగుదేశం ప్రభుత్వం ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేసేందుకు నిర్ణయించింది. దీపావళి రోజున ఆ పథకం ప్రారంభమవుతోంది. ఆమేరకు జిల్లాలోనూ అక్టోబరు 31 దీపావళి పండుగరోజు నుంచి ఈ పథకం అమలులోకి వస్తుందని, ఎల్‌పీజీ కనెక్షన్, ఆధార్ నంబరు, బియ్యంకార్డు, ఇతర శాఖల డేటాబేస్‌తో సరిపోలినవారికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 31 నుంచి మార్చి 2025 వరకు ఒకటవ సిలిండర్‌ను ఇస్తున్నామని, వచ్చే ఏప్రిల్ 1 నుంచి జులై 31లోగా రెండవది, ఆగస్టు 1 నుంచి 31వ తేదీలోపు మూడవ సిలిండర్‌ను ఇస్తామన్నారు.



ఉత్తరక్రియలు

మూర్తీభవించిన మానవత్వంతో
మంచితనం నిండిన వ్యక్తిత్వంతో
పదిమందికి సేవచేసే మనస్తత్వంతో
ఎవరినీ నొప్పించని స్నేహతత్వంతో
మా మనసులలో కొలువైన
మా ఇంటి పెద్ద

శ్రీ పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి గారు

అక్టోబర్ 19, శనివారం నాడు పరమపదించారు.

వారు మా మధ్య లేకపోయినా..
వారు అందించిన కీర్తి, మాలో నింపిన స్ఫూర్తి
మా హృదయాలలో శాశ్వతంగా ఉంటాయి.

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...
అశ్రునయనాలతో...
పాపకన్ను కుటుంబసభ్యులు

శ్రీ పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి గారు
నిర్యాణం : 19.10.2024

ఉత్తరక్రియలు

వారి పెద్దకర్మ తేది.06.11.2024 బుధవారం రాపూరు మండలం, వేపినాపి గ్రామంలోని వారి స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.




# ఎగిరిపోయిన విమానాశ్రయం తిరిగొస్తోంది!


**వైసీపీ పాలనలో దగదర్తి సమీపంలోని దామవరం నుండి ఎగిరిపోయిన విమానాశ్రయం మళ్ళీ తిరిగొస్తోంది. తీరని కోరికగా మిగిలిపోయిన జిల్లావాసుల ఆకాంక్ష నెరవేరబోతోంది. నెల్లూరు నుండే నేరుగా మహా నగరాలకు గాలిలో చేరుకునే తరుణం రానుంది. త్వరలో మళ్ళీ విమానాశ్రయ పనులు మొదలు కానున్నట్లు జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ఇటీవల ప్రకటించారు.**

నెల్లూరు విమానాశ్రయం వివరాల లోకి వెళ్తే...

ఉమ్మడి రాష్ట్రం 2014లో రెండు ముక్కలైంది. ఆ తరువాత 2014 నుండి 2019 వరకు తెలుగుదేశం అధికార పగ్గాలు చేపట్టి కొత్త రాష్ట్రాన్ని పరిపాలించింది. ఆ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నెల్లూరు – కావలి మధ్య దగదర్తి ప్రాంతంలోని దామవరం వద్ద విమానాశ్రయ ఏర్పాటుకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఆయనే స్వయంగా జనవరి 11, 2019లో "నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు"(NIAL)కి శంకుస్థాపన కూడా చేశారు. ఆ తరువాత అధికారం లోకి వచ్చిన వైసీపీ హయాంలో విమానం వాలకుండానే ఆ విమానాశ్రయానికి రెక్కలొచ్చాయి. అది నెల్లూరు నుండి ఎగిరిపోయి కందుకూరు వద్ద వాలింది. విమానాశ్రయం అక్కడికి మారుస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం శాసనసభలో ప్రకటన చేసిందే తప్ప, ఏర్పాటు దిశగా ఒక్క అంగుళం కూడా ముందుకి పడలేదు. ఓ రకంగా అది జిల్లాకి కలిసొచ్చింది. ముందుగా అనుకున్న చోటే ఇప్పుడు మళ్ళీ ఎయిర్‌పోర్టు రాబోతోంది. మొదట అనుకున్న ప్రకారం దామవరం వద్ద నిర్మించదలచిన విమానాశ్రయం కోసం సుమారు 1380 ఎకరాల భూసేకరణ కూడా జరిగింది. దాదాపు 650 ఎకరాలకి ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించింది. వైకాపా రాగానే దామవరం ఎయిర్‌పోర్టుని నీరుగార్చేసింది. ఎక్కడి పనులు అక్కడే నిలిపేసింది.

## ఇప్పుడు తిరిగొస్తోంది!

ఇన్నాళ్ళకి మళ్ళీ దామవరం విమానాశ్రయ పనుల్లో కదలిక ప్రారంభమయ్యింది. గత ఎన్నికల తరుణంలో చంద్రబాబు జిల్లావాసులకి ఇచ్చిన హామీలలో ఇది కూడా ఒకటి. ఇప్పుడు అది నెరవేరబోతోందన్న శుభవార్తని దీపావళి కానుకగా జిల్లావాసులకి నాయకులు అందించారు. ఇటీవల జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు సంయుక్తంగా ఈ విషయం ప్రకటించారు. మాజీ మంత్రి సోమిరెడ్డి




**2019లో ముఖ్యమంత్రి హోదాలో నెల్లూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసిన చంద్రబాబునాయుడు**

చంద్రమోహన్‌రెడ్డి, రూరల్ ఎంఎల్‌ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధికారులతో కలసి కలెక్టర్ కార్యాలయంలో జరిపిన సమీక్షా సమావేశంలో ఈ వార్త ప్రకటించారు. జిల్లాకి ఎయిర్‌పోర్టు అవసరం చాలా ఉందని, తక్షణ ప్రాతిపదికన విమానాశ్రయ ఏర్పాటుపై దృష్టిపెట్టి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రతినిధులు, అధికారులు కూడా త్వరలో జిల్లాలో పర్యటించి విమానాశ్రయ ఏర్పాటు ప్రక్రియని వేగవంతం చేస్తారని చెప్పారు.

జిల్లావాసుల చిరకాల కల నేరబోతోంది. నాయకులు చెప్పినట్లుగా రాబోయే మూడేళ్ళలో విమానాశ్రయం ఏర్పాటు చేయగలిగితే ఆనం, పొంగూరు పేర్లు జిల్లా రవాణా రంగ చరిత్రలో చిరస్థాయిగా నిలబడిపోతాయి.

## పారిశ్రామికవాడలకి తరలిపోనున్న రైస్ మిల్లులు!

నగర నడిబొడ్డులో కాలుష్యానికి కారణమవుతున్న రైస్‌మిల్లులని కూడా ఒకే చోటుకి తరలించే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు కూడా మంత్రుల ద్వయం పేర్కొంది. "రైస్ మిల్లులు ఎక్కువగా కార్పొరేషన్ ఏరియాలో ఉన్నాయి. అయితే ఇప్పుడు ఎన్జీటీ చాలా కఠినంగా ఉంది. రైస్ మిల్లులు ఉన్న ప్రాంతాల్లో నాలుగు రెట్లు ఎక్కువగా కాలుష్యం ఉంది. ఈ క్రమంలో ఎన్జీటీ నిబంధనల మేరకు... ఆ రైస్ మిల్లును నగర నడిబొడ్డు నుండి మార్చాల్సిన అవసరం చాలా ఉంది" అని మంత్రి నారాయణ చెప్పారు.

కిసాన్ ఎస్ఈజెడ్ లేదా కృష్ణపట్నం పోర్టు ప్రాంతాల్లో మిల్లులు ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. మిల్లుల యజమానులని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకోవడం లేదని అంటూ, వాళ్ళు వ్యాపారాలు చేసుకుంటేనే రాష్ట్రానికి జీఎస్టీ కూడా బాగా వస్తుందని మంత్రులు స్పష్టత ఇచ్చారు. రైస్ మిల్లుల యజమానులు, అసోసియేషన్ నాయకులు అందరూ చర్చించుకుని నిర్ణయం తీసుకుని సహకరించాలని మంత్రులు కోరారు.


శుభం... అన్నీ మంచి శకునాలే..!



# సోమశిల డ్యామ్‌కు..జల కళ!

ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురిసిన భారీవర్షాల వల్లనైతేనేమి, ఎగువప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి ప్రవాహాల వల్ల నైతేనేమి జిల్లాలోని సోమశిల రిజర్వాయర్ జలకళతో తొణికిసలాడుతోంది. జిల్లాకు ప్రాణప్రదమైన సోమశిల జలాశయం నీటిమట్టం 77.988 టీఎంసీలు కాగా, అక్టోబర్ 29వతేదీ నాటికి 66.480 టీఎంసీల నీటినిల్వతో నిండుకుండలా ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి ఇంకా వరదనీరు వస్తూనే ఉంది. మంగళవారం సాయంత్రానికి 19,923 క్యూసెక్కుల వరద ప్రవాహం రిజర్వాయరుకు చేరినట్లు అధికారులు అంచనా. దీంతో దిగువనున్న డెల్టాకు కొరత లేకుండా నీటిని సరఫరా చేస్తున్నారు. కండలేరు డ్యామ్ కూడా నీటితో నిండుగా ఉంది.

# మళ్ళీ మళ్ళీ మరణిస్తున్న మహానేత..!



"పుట్టినవాడు మరణించక తప్పదు"... భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించిన జీవిత సత్యం ఇది. కానీ మరణించిన వాడు మళ్ళీ మళ్ళీ మరణించడం బహుశా బహు అరుదు. అలాంటి అరుదైన దురదృష్టం దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డికి దాపురించింది. తెలుగు ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిని మరణం మళ్ళీ మళ్ళీ వెంటాడుతూనే ఉంది. సెప్టెంబరు 2, 2009లో హెలికాప్టర్ ప్రమాద రూపంలో మృత్యువు తొలిసారిగా ఆయనని కబళించింది. అది ఆయనకి తొలి మరణం. ఆయన సతీమణి వై.ఎస్.విజయమ్మ విశాఖపట్టణంలో ఘోర పరాజయం పొందినప్పుడు ఆయన రెండవసారి మరణించాడు. ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి కేసుల ఛార్జిషీట్‌లో రాజశేఖరరెడ్డి పేరు చేర్చినప్పుడు ఆయన మూడవసారి అసువులు బాశాడు.

ఉమ్మడి రాష్ట్రం రెండుముక్కలై ఆంధ్ర అనాథగా మారినప్పుడు నాలుగవసారి మృతి చెందాడు. అన్నకి వ్యతిరేకంగా చెల్లెలు తొలిసారి ఏబీఎన్ ఛానల్ గడప తొక్కినప్పుడు వై.ఎస్. అయిదవసారి కన్నుమూశాడు.

షర్మిల తెలంగాణలో పార్టీపెట్టి ఘోర పరాజయం పొందినప్పుడు ఆరవసారి మృత్యువు పాలయ్యాడు. అంతుచిక్కని మిస్టరీగా తన తమ్ముడు వై.ఎస్.వివేకా హత్య జరిగినప్పుడు ఏడవసారి మరణించాడు. తన పేరుతో పెట్టిన వై.ఎస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీకి గౌరవాధ్యక్షురాలిగా తన సతీమణి వై.ఎస్.విజయలక్ష్మి రాజీనామా చేసినప్పుడు ఎనిమిదవసారి కాలం చేశాడు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో తన కుమార్తె షర్మిల, ఆమె సోదరుడు జగన్‌మోహన్‌రెడ్డిపైన వాగ్బాణాలు సంధిస్తున్నప్పుడు తొమ్మిదవసారి కన్నుమూశాడు. ఆంధ్రలో తన కొడుకు 151 సీట్లతో అధికారం సాధించి, అపరిపక్వ పరిపాలనతో అయిదేళ్ళ తరువాత కేవలం 11సీట్లకే పరిమితమైనప్పుడు మరోసారి దివంగతులయ్యారు. తన అమ్మకి, చెల్లికి వ్యతిరేకంగా జగన్‌మోహన్‌రెడ్డి కోర్టు మెట్లు ఎక్కినప్పుడు ఇంకోసారి మరణించాడు. అన్నని ప్రశ్నిస్తూ చెల్లెలు బహిరంగ లేఖ రాస్తూ ఇంటి గుట్టుని రట్టు చేసినప్పుడు మరోసారి స్వర్గస్తులయ్యారు. తన భార్యకి, కూతురుకి వ్యతిరేకంగా తన షడ్రుకుడు వై.వి.సుబ్బారెడ్డి అబద్ధాలతో మీడియాముందుకి వచ్చినప్పుడు మళ్ళీ మరణించాడు. తాజాగా ఎదుగూరు సందింటి కుటుంబ పెద్ద, సాక్షాత్తు తన సతీమణే తన కూతురుకి మద్దతుగా తెలుగు ప్రజానీకానికి బహిరంగ లేఖ రాసినప్పుడు మనోవేదనతో వై.ఎస్. మళ్ళీ కన్నుమూశాడు.

ఇలా మహానేత ఇప్పటికి 14సార్లు మరణించాడు. ఇక ఆయనకి మరణించే శక్తి కూడా లేదు. ఇంకా ఘోరాలు జరిగితే చూసి తట్టుకునే ధైర్యం ఆయన ఆత్మకి అంతకన్నా లేదు. చరిత్రలో ఎవరికీ రాని దుస్థితి తనకి వచ్చినందుకు ఇప్పటికే ఆ ఆత్మ క్షోభిస్తోంది. తమ మహానేత కుటుంబానికి వచ్చిన కష్టాన్ని చూసి ఆ కుటుంబ నిజమైన అభిమానుల హృదయం రోదిస్తోంది. ఇకనైనా ఈ ఘోరాలకి మంగళం పాడండి. ఇప్పటికే 14సార్లు మరణించిన రాజన్న ఆత్మని వదిలిపెట్టండి..!

-విహారి



లాయర్
నవంబర్ 01, 2024

# 'కృత్రిమ మేధ' చుట్టూ.. ప్రపంచం పరుగులు

భూమి సూర్యుడు చుట్టూ తిరుగుతోంది. అదేవిధంగా, ప్రస్తుత ప్రపంచమంతా 'కృత్రిమ మేధస్సు' చుట్టూ పరుగులు తీస్తోంది. మనమిప్పుడు ఎక్కడున్నాం అని ప్రశ్నించుకుంటే, సాంకేతిక యుగంలోనే అన్నది నూటికి నూరుపాళ్ళు స్పష్టం. అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం విస్తారంగా అందుబాటులోకి వచ్చాక మనిషి మేధస్సు కలలో కూడా ఊహించలేనన్ని అద్భుతాలను ఆవిష్కరిస్తోంది. లెక్కలేనన్ని పరిశోధనలు, అంతులేనన్ని ప్రయోగాలు నిరంతరం నిర్విరామంగా జరుగుతూనే ఉన్నాయి. మనిషి బుర్రలోంచి పుట్టుకొచ్చే రకరకాల ఆలోచనల సమ్మేళనమంతా కలసి, యంత్రాలకు సైతం మాటలు నేర్పి, చెప్పింది చెప్పినట్లుగా పనిచేయించుకునే రోజులు వచ్చేశాయి. మొత్తంగా..దాన్నే ముద్దుగా 'ఏఐ' అని పిలుచుకుంటున్నాం. ఏఐ..అంటే ఆంగ్లంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనీ, తెలుగులోకి వస్తే 'కృత్రిమ మేధ' అనీ అంటున్నాం. మనిషి కోసం మనిషి తయారుచేసుకున్నాడు కాబట్టి.. దానిని కృత్రిమ మేధగా చెప్పుకుంటున్నాం. కంప్యూటర్లకు శిక్షణ ఇచ్చి డేటా ఇస్తే చాలు..యంత్రాలు కూడా మనుషుల్లాగా పనిచేసే సాంకేతికత అరచేతిలోకి వచ్చేసింది. సక్రమంగా వినియోగించుకోవాలే కానీ, మనం రూపొందించిన రోబోలు మనలాగే పనిచేస్తాయి. మనలాగానే మాట్లాడతాయి. చదువుతాయి. రాస్తాయి..అన్నీ చేస్తాయి. అందుకే, ప్రపంచమంతా ఇప్పుడు ఏఐలోనే మునిగితేలుతోంది. వాస్తవానికి 'కృత్రిమ మేధ' అన్న పదం ఇప్పటిదేమీ కాదు, 1956 ప్రాంతంలోనే వినవచ్చింది. అది ప్రయోగదశ అన్న మాట. ఆ తర్వాత కాలంలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వచ్చేశాక పరిశోధనలు మరింతగా పెరిగిపోవడంతో కృత్రిమ మేధ అందరికీ అనుభవంలోకి వస్తోంది. అదిప్పుడు విశ్వమంతా తానే అన్నట్లుగా తయారైంది కూడా. అనేక రంగాల్లో దానిదే పెత్తనం. వైద్యరంగంలోనైతే, గుండె వైఫల్యాలను రెండేళ్ళకు ముందుగానే తెలుసుకునే స్థాయి వచ్చేసింది. లెక్కలేనంత సమాచారాన్ని క్రోడీకరించి అవసరమైన విషయాన్ని అందివ్వడంలో ఏఐ కీలకపాత్ర పోషిస్తోంది. దీంతో అన్ని రంగాలకూ అది అత్యంత ఆవశ్యకమైంది. విద్యారంగం, పారిశ్రామిక, వ్యావసాయిక రంగాలు, అనేకరకాల ప్రాజెక్టులు, బ్యాంకింగ్ వ్యవస్థ, రక్షణ రంగం, వాతావరణ సూచనలు, పొలాల్లో దిగి నాట్లు వేసే యంత్రాలు, రాబోయే విపత్తులను ముందే తెలుసుకోవడం వంటివన్నీ ఏఐ పరిజ్ఞానంతోనే సాధ్యమవుతున్నాయి. మానవాకారాల్లో సాంకేతికతతో పనిచేసే రోబోలు కూడా రావడంతో, అనేక దేశాల్లో వీటి వినియోగం కూడా పెరిగిపోతూనే ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ యుగం..ఏఐ యుగం. ప్రతి రంగంలోనూ, ప్రతి వ్యవస్థలోనూ, ప్రతిచోటా ఏఐ దూసుకువచ్చేసింది. దేనికదే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు, టూల్స్, యాప్స్ వంటి వాటితో అత్యంత సునాయసంగా, తక్కువ ఖర్చుతోనే బహుళ ప్రయోజనాలు పొందుతున్నాయి. అందుకే ఏఐ వంటి సాంకేతిక నిపుణులకు రోబోటిక్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అవకాశాలు వస్తున్నాయి. ఎలాంటి దుర్వినియోగాలు, వినాశాలకు పాల్పడకుండా మానవ వికాసానికే ఉపయోగిస్తే ఈ సాంకేతికత నిజంగానే మానవాళికి మహోదయమవుతుంది. పొద్దున్నే ఫోన్ చూడాలన్నా, మన వేలిని తాకించి ఫోన్ తెరిచేందుకు కూడా అదే ఉపయోగపడుతోంది. ఇంటర్‌నెట్‌లో ఉన్న కోటానుకోట్ల అంశాల నుంచి మనకు కావాల్సిన విషయాన్ని క్షణాల్లో అందుకోగలుగుతున్నామంటే..కేవలం ఆ కృత్రిమ మేధ వల్లనే. వాహనాలు వెళ్ళే దారిని చూపించడం, ఈమెయిల్స్‌లో ఫిల్టర్లు, స్మార్ట్ రిప్లైలు, వెబ్‌సైట్‌లో చాటింగ్‌లు, ఓటీటీలో సినిమాలూ.. ఇలా ఏదైనా సరే.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తోనే అందుబాటులోకి వస్తున్నాయి. ఆకాశమే హద్దు అన్నట్లుగా నేటి ఆధునిక మానవుడు తన మేధాశక్తితో మరో ప్రపంచాన్నే సృష్టిస్తున్నాడు. మాటలా, పాటలా, దృశ్యాలా..ఒకటనేమిటి ఎవరికేది కావాలంటే అది చిటికెలో అందుబాటులోకి తెచ్చేస్తోంది.. ఏఐ. అందుకు తగ్గట్టుగా ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ల సాంకేతికతతో డ్రోన్‌ల వ్యవస్థ కూడా వచ్చేసింది. రక్షణ తదితర రంగాల్లో వీటి ఉపయోగం గణనీయంగా ఉంటోంది. మనిషి వెళ్ళలేని దట్టమైన అడవుల్లో, చీకట్లో కూడా స్పష్టంగా చూడగలిగే మానవరహిత డ్రోన్ల వినియోగం కూడా విపరీతంగా ఉంది. ఇప్పుడున్న పాతతరం వారు ఈ మార్పులన్నీ చూడగలుగుతున్నారు. రేడియోలు, టీవీలు కూడా లేని రోజుల నుంచి, స్మార్ట్ ఫోన్ల దాకా..మారుతున్న ప్రపంచాన్ని చూసి విస్తుపోతున్నారు. ఏదేమైనా, మనిషి తన అమేయమైన మేధాశక్తితో మానవజాతి అభివృద్ధికి.. అభ్యుదయానికి బాటలు వేస్తున్న నేటి సరికొత్త ఏఐ యుగంలో.. మనం ఉండడం కూడా ఒక అదృష్టమే అనుకోవచ్చు!..

## టైమింగు మార్చినా.. సింహపురి 'హింసపురే'!

సికిందరాబాదు నుండి గూడూరుకి వచ్చే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు సమయాలలో రైల్వేశాఖ మార్పు చేసింది. గతంలో రాత్రి 11.00గంటలకి సికిందరాబాదులో బయలుదేరేది. ఇప్పుడు ఆ సమయాన్ని రాత్రి 10.05కి మార్చారు. బయలుదేరే వేళలో అయితే మార్పు జరిగింది తప్ప, గమ్యస్థానాలకి చేరే సమయంలో మాత్రం ఆ ట్రైన్‌లో ఎలాంటి మార్పు రాలేదు. ఎప్పటిలాగే ఆ రైలు కనీసం రెండుగంటలు ఆలస్యంగానే నడుస్తోంది. సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేవారు అనాదిగా ఈ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. సింహపురి అంటేనే హింసపురి అని ముద్దుపేరు కూడా పెట్టుకున్నారు. ఉదయం 7.45కి ఈ రైలు నెల్లూరు చేరుకోవాలి. ఒక్క రోజుకూడా నిర్ణీత సమయానికి వచ్చిన దాఖలాలు లేవు. ఆ విషయాన్ని అదే రైలులో ప్రయాణించే రైల్వేశాఖ సిబ్బందే ఒప్పుకుంటారు. రైల్వే ఉన్నతాధికారులు చొరవచూపి సింహపురి ప్రయాణంలో లోపం ఎక్కడవుందో గమనించి సరిచేయాలి. లేదంటే సింహపురికి 'హింసపురి' అన్న పేరే శాశ్వతమైపోతుంది!

డి.హరిత, గూడూరు.

## కస్తూర్బా కళాక్షేత్రంలో సారాయి పాటలా? హవ్వ!

నెల్లూరు నగరంలో శ్రీ వెంకటేశ్వర కస్తూర్బాకళాక్షేత్రం తెలియని వారు ఉండరు. శ్రీ కస్తూరిదేవి విద్యాలయానికి చెందిన స్థలంలో ప్రభుత్వం ఈ ఆడిటోరియం నిర్మించింది. జాతిపిత మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బాగాంధీ పేరుని ఈ కళామందిరానికి పెట్టారు. ముందు శ్రీ వెంకటేశ్వరస్వామి వారి పేరుని కూడా జోడించారు. ఇక్కడ సాహిత్య, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలకంటే ప్రభుత్వ సభలు, సమావేశాలే ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రభుత్వం వారి అధీనంలో ఉన్న హాలు కాబట్టి అక్కడ ఏం జరుపుకున్నా అది వారి ఇష్టం. కానీ, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మద్యం దుకాణాల వేలంపాటల తంతుకి కూడా ఈ హాలునే వేదిక చేయడం అభ్యంతరకరం. కస్తూర్బా పేరుతో ఉన్న హాల్లో సారా అంగళ్ళ ఎంపిక ప్రక్రియని చేపట్టడం సిగ్గుచేటైన విషయం. భవిష్యత్తులోనైనా ఈ ప్రాంగణాన్ని అలాంటి చౌకబారు కార్యక్రమాల కోసం వాడకుండా ఉండాలని ప్రభుత్వ పెద్దలకి నా విజ్ఞప్తి, విన్నపం, వేడుకోలు!

– తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## రామాయణం రమణీయంగా ఉంది!

మన 'లాయర్'లో గత 36 వారాలుగా ధారావాహికగా వస్తున్న "జానకి రామ రామాయణం" చాలా బాగుంది. పామరులకి సైతం అర్ధమయ్యేలా సులభతరమైన వ్యావహారిక భాషలో జానకి రామారావు గారు రామాయణాన్ని చక్కగా వివరిస్తున్నారు. అమెరికాలో ఉంటున్న నా స్నేహితురాళ్ళకి, బంధువులకి నేను ప్రతి వారం ఈ రామాయణం కోసమే ప్రత్యేకంగా 'లాయర్' పంపిస్తాను. ఇలాంటి అద్భుతమైన కావ్యాన్ని అందిస్తున్న 'లాయర్' యాజమాన్యానికి నా అభినందనలు. రమణీయమైన ఈ రామాయణం కోసం మరికొంత స్థలాన్ని కేటాయించి ఇంకా కొంచం ఎక్కువ కథ నడిచేలా చేస్తే బాగుంటుందన్నది నా అభిప్రాయం.

వీ.సత్యవతి
చార్లెట్, యు.ఎస్.ఏ.




# మద్యం మత్తులో మగువ..!

మహిళలు మద్యపానం సేవించడం అన్నది ఎప్పటి ఆచారం..? పురుషులు సురాపానం సేవించడం అన్న విషయాన్ని మనం మన పురాణాలలో చదువుకున్నాం. కథలలో విన్నాం. అనేక సినిమాలలో కూడా చూశాం, చూస్తూనే వున్నాం. మగువలు కూడా మద్యపానం సేవిస్తారన్నది పురాణాలలో ఒకటి రెండు సందర్భాలలో తప్ప ఎక్కువగా వినలేదు. రాజుల కాలంలో కూడా మహారాణులు మధుపానం చేసినట్లు కానీ, వ్యభిచారాన్ని కులవృత్తిగా ఆచరించే వేశ్యలు సైతం మద్యం పుచ్చుకున్నట్లు కానీ మన పౌరాణిక, జానపద సినిమాలలో కూడా మనం ఎప్పుడూ చూడలేదు.

రామాయణ-మహాభారతాల్లో మాత్రం కొన్ని సందర్భాలలో ఆ రోజుల్లో మహిళలు కూడా సురాపానం సేవించేవారన్న ప్రస్తావన వచ్చింది. రాక్షసులలో మాత్రమే మగువలు మద్యం తాగేవారనే అర్థం వచ్చేలా ఓ సందర్భంలోను, దేవతలకి మద్యం(కల్లు) నైవేద్యంగా పెట్టి ఆరాధించేవారని మరో సందర్భంలోనూ రామాయణంలో చెప్పబడింది. అలాగే మహాభారతం విరాటపర్వంలో కూడా మదిర(మద్యం) అనే మాట వాడినట్లు లిఖించబడింది.

### వాల్మీకి రామాయణంలో...

హనుమంతుడు లంకలో సీతమ్మవారిని వెతికే ప్రయత్నంలో "పానభూమి" (మధుశాల)ని చూసినప్పుడు "ఆ పానగృహంలో కొందరు స్త్రీలు పాటలు పాడి అలసిరి. మరికొందరు నృత్యముచేత అలసిపోయిరి. మరికొందరు మధ్యపానముచే స్పృతితప్పి పడివుండిరి" అని వాల్మీకి రామాయణంలోని సుందరకాండ 11వ సర్గలో పేర్కొనబడి ఉంది.

అలాగే...

అయోధ్యకాండ 52వ సర్గలో (83-91) "మంగళప్రదురాలవైన ఓ గంగాదేవీ! నిన్ను నమస్కరించి స్తుతించుచున్నాను. పురుషశ్రేష్ఠుడైన రాముడు, రాజ్యమును పొందిన పిమ్మట, నీ సంతోషమునకై బ్రాహ్మణులకు లక్షలకొలది గోవులను, వస్త్రములను, మంచి అన్నమును ఇచ్చెదను. వనవాసము నుండి తిరిగి వచ్చిన పిమ్మట, నేను నియమవంతురాలనై నీకు వెయ్యి కుండల కల్లు, మాంసరూపమైన ఆహారము సమర్పించి పూజించెదను." అని సీత గంగాదేవిని ప్రార్థించినట్లుగా వ్రాయబడింది.

### మహాభారతంలో...

మహాభారతంలో విరాటపర్వంలో సైతం మద్యం ప్రస్తావన వచ్చింది. పాండవులు అజ్ఞాతవాసం చేస్తున్న తరుణంలో విరాట్ మహారాజు భార్య సుధేష్ణ వద్ద సైరంధ్రి నామధేయంతో చలామణి అవుతుండిన ద్రౌపదిని మోహించిన తన తమ్ముడు కీచకుడి వద్దకి పంపే సమయంలో "నాకు మంచి మదిర (మద్యం) త్రాగాలని ఉంది. మా సోదరుడు కీచకుని వద్ద మంచి మదిర ఉంటుంది.. వెళ్ళి తీసుకునిరా" అని చెప్పి పంపించిందని చరిత్ర చెప్తోంది. అంటే పురాతన కాలంలో సైతం మగువలు మద్యం సేవించే వారనడానికి ఈ సంఘటన కూడా ఓ ఉదాహరణ.

"కాపాలికశైవాన్ని అనుసరించే స్త్రీపురుషులు ఇద్దరూ మద్యపానప్రియులేనని.. పల్లవచక్రవర్తి మహేంద్రవిక్రమవర్మ (7వ శతాబ్దం) తన మత్తవిలాస ప్రహసనంలో ఈ పాత్రలను సృష్టించాడని" కూడా ప్రవచన పండితులు కొన్ని సందర్భాల్లో పేర్కొంటున్నారు.

### ఆధునిక కాలంలో....

తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు, దళితులు, గిరిజనులు ఆడ, మగ కలసి కల్లు, సారాయి తాగడం అన్నది అనాదిగా వస్తున్న ఆచారం. ఇప్పుడు ఆ ఆచారం ఆధునిక సమాజానికి కూడా ప్రాకింది. ప్రస్తుతం నడుస్తున్న కలికాలంలో పురుషులు స్త్రీలు కలసి మద్యం సేవించడం అన్నది సర్వసాధారణమైపోయింది. అంతర్జాతీయంగా మద్యం త్రాగే మహిళల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని అనేక సర్వేలు వెల్లడిచేస్తున్నాయి. ముఖ్యంగా కొత్త ఢిల్లీ, ముంబై, పూణే, కలకత్తా, హైదరాబాదు, బెంగళూరు, చెన్నై వంటి మెట్రోపాలిటన్, కాస్మోపాలిటన్ నగరాలలో మందు తాగే మహిళల సంఖ్య భారీగా పెరిగింది. ఈ నగరాలలో బార్లు, పబ్బులు, నైట్‌క్లబ్బులు వంటి సంస్కృతి వేళ్లూనుకుంటోంది. ఇటీవల మన పొరుగు రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరంలో జరుగుతున్న రేవ్ పార్టీల గురించి మనం తరచూ వింటూనే ఉన్నాం. అనేక సందర్భాలలో చూస్తూనే ఉన్నాం. తెలంగాణలో పెళ్ళిళ్ళ సందర్భంలో జరిగే మెహందీ, సంగీత్, బ్యాచిలర్ పార్టీ, రిసెప్షన్ వంటి వేడుకలలో పురుషులతో సమానంగా మహిళలు కూడా మధుపానీయాలు సేవించడం పరిపాటైపోయింది. ఇటీవల కొన్ని వేడుకలలో మహిళల కోసం ప్రత్యేక బార్ కౌంటర్లు కూడా ఏర్పాటు చేసే స్థాయికి మహిళామణుల మద్యసేవన శాతం పెరిగిపోయింది.

### మద్యం వ్యాపారంలో కూడా పోటీపడుతున్న మహిళలు...

తాజాగా రెండు వారాల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మద్యం దుకాణాల కేటాయింపు టెండర్లలో మహిళలు సైతం అధికంగా పాల్గొన్నారు. మొత్తం 3396 మద్యం దుకాణాలకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపితే, వీటిలో 10.20 శాతం అంటే 345 వైన్‌షాపులు మహిళలే దక్కించుకోవడం గమనార్హం. మహిళలు మద్యం త్రాగడం అన్న విషయాన్ని పక్కనపెడితే, నారీమణులు కూడా మద్యం వ్యాపారంలో పోటీపడే స్థాయికి మన సమాజం ఎదిగిందన్నది ఇక్కడ గుర్తించాల్సిన విషయం.

సారా నిషేధ ఉద్యమానికి పుట్టినిల్లు నెల్లూరు. ప్రభుత్వాల మెడలు వంచి సంపూర్ణ మద్య నిషేధం విధించే స్థాయిలో మహిళలలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన దూబగుంట రోశమ్మ పుట్టిన గడ్డ నెల్లూరు. అలాంటి నెల్లూరుజిల్లాలోనే 24 మద్యం దుకాణాలు మహిళలు దక్కించుకున్నారు. మహిళలని సైతం మద్యం ఏ స్థాయిలో ప్రభావితం చేస్తుందో తెలియచేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో వైన్‌షాపుల కోసం మహిళలు పోటీ పడడమే ఉదాహరణ.

"ఓ మగువా వర్థిల్లు.. మద్యం మత్తులో పరిఢవిల్లు..!"

- రాజశ్రీ

# ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

## ప్రత్యేక వేదికకు శ్రీకారం చుట్టిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అక్టోబర్28న శ్రీకారం చుట్టారు. అనంతసాగరం మండల కాంప్లెక్స్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో తొలిసారిగా మంత్రి ఆనం ఆధ్వర్యంలో అనంతసాగరం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల, జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి మొత్తం 1246 అర్జీలు వచ్చాయి. అనంతసాగరం మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల ప్రజల అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు కోసం 25 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, వాటిని సత్వరం పరిశీలించే దిశగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేవలం అర్జీలు తీసుకోవడమే కాదు, వాటికి సత్వర పరిష్కారం చూపడం కోసమే అనంతసాగరం మండలం నుంచి ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇదే తరహాలో నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో త్వరలోనే కార్యక్రమాలను నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. సోమశిల జలాశయం అభివృద్ధి పనులు, సోమేశ్వరాలయ పునర్నిర్మాణం, నడికుడి–శ్రీకాళహస్తి రైల్వేలైను, జాతీయ రహదారుల ఏర్పాటుతో ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. నడికుడి– శ్రీకాళహస్తి రైల్వేలైను పూర్తిచేసి ఆత్మకూరు మెట్టప్రాంత ప్రజలకు రైలు సౌకర్యం కల్పించడమే ప్రధాన లక్ష్యమని, ఈ రైల్వేలైన్‌ను నెల్లూరుకు అనుసంధానించేలా ప్రతిపాదనలు కూడా చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. తద్వారా పంట ఉత్పత్తులను సులభంగా తరలించే సౌకర్యం కలుగుతుందని మంత్రి తెలిపారు. అనంతసాగరం మండలానికి ఒకటిన్నర కోటి రూపాయలు ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో సిమెంట్ రోడ్లను నిర్మిస్తామని, మార్చి 31లోగా రోడ్డు పనులను పూర్తి చేయిస్తామన్నారు.

### సోమేశ్వరాలయం పునర్నిర్మాణానికి రూ.8.40 కోట్లు

గతంలో వరదలకు దెబ్బతిన్న సోమశిలలోని సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ తరపున 8.40 కోట్ల రూపాయలను మంజూరు చేశామని మంత్రి ఆనం ఈ సందర్భంగా చెప్పారు. ఆలయ నిర్మాణానికి ఇంకా అవసరమైన నిధులను కూడా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే శృంగేరి పీఠాధిపతి ఆధ్వర్యంలో పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.



# అందరికీ అందుబాటులోకి.. ఇసుక

'ఇసుక అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఇక ఉచితంగా తీసుకెళ్లవచ్చు'నని కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరంలో మరో నాలుగు రీచ్‌లు ప్రారంభించేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. ఎక్కడా అక్రమాలు జరగకుండా ఇసుకనందించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలను పెడుతున్నారు. అక్టోబర్ 28న మంత్రి నారాయణ ఆ ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ట్రాక్టర్‌పైకి ఎక్కి పెన్నానది వద్ద వారధి ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని తీసుకు వచ్చారని, ప్రజలందరూ ఇసుకని ఉచితంగా తీసుకెళ్లవచ్చని ఆయన ప్రకటించారు. నెల్లూరు సిటీ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ, బోడిగాడితోట, గాంధీ గిరిజన కాలనీ, దీనదయాళ్‌నగర్, పొర్లుకట్ట, పొట్టేపాళెం తదితం ఇసుక రీచ్‌లను ఆయన అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకి ఇసుకను అందించాలని మంత్రి అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మొదట రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశమన్నారు.

## మంత్రి నారాయణ ఓఎస్డీగా వెంకటేశ్వర్లు



రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణకు ఓఎస్డీగా ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న జి. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నెల్లూరుజిల్లాలోని అనుమసముద్రంపేట మండలం కావలి యడవల్లి గ్రామానికి చెందిన ఆయన, గతంలో రెవెన్యూశాఖలో తహశీల్దారుగా కూడా పనిచేశారు. సమర్ధవంతంగా విధులు నిర్వహించే ఉత్తమ అధికారిగా పేరున్న వెంకటేశ్వర్లు మంత్రి నారాయణ ఓఎస్డీగా నియమితులు కావడం పట్ల జిల్లాప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


శ్రద్ధాంజలి




స్నేహాభిలాషి, రైతు సోదరుల శ్రేయోభిలాషి
మా కుటుంబ అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన
మా ఇంటి పెద్దదిక్కు

**మావిళ్ళపల్లి రమణయ్యనాయుడు గారు**

(వాసవి మోటార్స్, నెల్లూరు.)

అక్టోబర్ 25వ తేదీ శుక్రవారం పరమపదించారు.
వారి దివ్య ఆత్మకి సద్గతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
మా శ్రద్ధాంజలి.

భార్య : **మావిళ్ళపల్లి సీతారామమ్మ**

కుమార్తె - అల్లుడు
**ముమ్వా భూదేవి - ముమ్వా పద్మయ్యనాయుడు**

మనుమలు
**ముమ్వా మహేష్‌బాబు**
**ముమ్వా అజయ్‌బాబు - శ్రీనిత**

మనుమరాలు
**డాక్టర్ నీరజ బిందు పచ్చ - డాక్టర్ రజనీకాంత్ పచ్చ**
చిన్నపిల్లల వైద్య నిపుణురాలు కాలేయ శస్త్రచికిత్స నిపుణులు

**ఉత్తరక్రియలు**

వారి పెద్దకర్మ తేది. 06.11.2024, బుధవారం,
ఉదయం 11.00 గంటలకి నెల్లూరు, శాంతినగర్‌లోని
వారి స్వగృహమునందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# నెల్లూరు కబుర్లు

## ఏసీ బస్‌షెల్టర్లకు.. త్వరలోనే మోక్షం




గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన ఏసీ బస్‌షెల్టర్లకు త్వరలోనే మోక్షం కలగనుంది. నెల్లూరు నగరాభివృద్ధికి సంబంధించి రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఇటీవల నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో పలు అంశాలను చర్చించారు. ఎండల ధాటికి బాధలుపడుతున్న ప్రయాణీకులకు విశ్రాంతినిచ్చేందుకు 2019లో నెల్లూరు నగరంలో 6 ఏసీ బస్ షెల్టర్లను ఏర్పాటుచేశామని, అయితే వాటిని ప్రారంభించే సమయానికి ఎన్నికలు రావడంతో అవి ఆగిపోయాయని చెప్పారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని మూసేసి... ఎందుకూ పనికిరాకుండా చేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, వాటిని పరిశీలించి మరో 15 రోజుల్లో ఏసీ బస్‌షెల్టర్లను మరమ్మత్తులు చేయించి తిరిగి ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. మరో 15 రోజుల్లో హడ్కో నిధులు వస్తాయని, అవి రాగానే నగరంలో అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ ప్రాజెక్టు పూర్తిచేసి నెల్లూరును దోమలు లేని నగరంగా మారుస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు.

## సకాలంలో స్పందిస్తే.. పక్షవాతాన్ని జయించవచ్చు

- ‘అపోలో’ వైద్యుల వెల్లడి



పక్షవాతం సోకినప్పుడు ప్రతి నిమిషం విలువైందని, ఎంత త్వరగా రోగిని వైద్యుని వద్దకు తీసుకెళ్తే అంత త్వరగా పక్షవాతాన్ని జయించవచ్చని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ బిందుమీనన్, ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ చెప్పారు. ప్రపంచ స్ట్రోక్ డేను పురస్కరించుకుని మంగళవారం అపోలో హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరంలో వారు మాట్లాడుతూ, పక్షవాతం బారినపడితే శరీరంలో సగ భాగం చచ్చుబడిపోతుందని, కాలు చేయి ఆడదని, నోట మాట రాదని చెప్పారు. బీపీ బాగా పెరగడం, ఊపిరి సరిగా తీసుకోకపోవడం, వాంతులు అవుతున్నట్లు ఉండటం, ఇవన్నీ పక్షవాతం రావడానికి ముందు కనిపించే సంకేతాలని, హై-బీపి, ధూమపానం, మద్యపానం, హై షుగర్ ఉన్నవాళ్లకు పక్షవాతం వచ్చే అవకాశాలు అధికమని వెల్లడించారు. పక్షవాతం బారిన పడినవారు నెల్లూరు అపోలో ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతోనే వైద్య సేవలు పొందే వీలుందని, ఆ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యూరాలజీ వైద్యులు డాక్టర్ రష్మీ, డాక్టర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- మానవత్వం చాటుకున్న..‘విశ్వసాయి’ విద్యార్థులు

### మదర్ థెరిస్సా హోమ్‌కు..

## 2 లక్షల విలువైన నిత్యావసరాలు



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి డాక్టర్ ఎస్సార్కే విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. నగరంలోని బీవీనగర్‌లో ఉన్న మదర్ థెరిస్సా హోమ్‌కు ఇటీవల దాదాపు రెండు లక్షల రూపాయలు విలువచేసే బియ్యం, పప్పులు, చింతపండు, బెల్లం తదితర నిత్యావసర సరుకులతో పాటు, ఆశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలను అందజేశారు. విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ, డైరెక్టర్ జి.కృష్ణమోహన్‌ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వస్తువులను సేకరించి మదర్ థెరిస్సా హోమ్‌లో ఉన్న వృద్ధులకు వితరణగా అందించడం పట్ల విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ సంతోషం వ్యక్తంచేస్తూ, అందుకు ప్రోత్సహించిన తల్లితండ్రులను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. చిన్నతనం నుంచే విద్యార్థులు మానవత్వంతో, దానగుణంతో ఎదగడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో మంచి కార్యక్రమాలను చేపట్టేందుకు విశ్వసాయి విద్యాసంస్థలు కృషిచేస్తాయని ఆయన చెప్పారు. ప్రిన్సిపాల్ ఎస్.రఘురాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాయిదర్బార్ ఆధ్వర్యంలో.. నిరుపేదలకు దుప్పట్లు



‘శ్రీ షిరిడీ సాయిబాబా 106వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాల సందర్భంగా నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న సాయిదర్బార్ అద్దాలమందిరం నిర్వాహకులు ఈనెల 27వ తేదీ వేకువన నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆరుబయట చెట్లకింద, ప్లాట్‌ఫారాల మీద, బస్టాండ్లు, ఆలయాలు, ప్రార్ధనామందిరాలు, రోడ్ల పక్కన చలికి వణుకుతూ పడుకుని ఉన్న అనేకమంది పేదలకు సాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యులు స్వయంగా దుప్పట్లు కప్పారు. గొలగమూడి, నరసింహకొండ, జొన్నవాడ ప్రాంతాల్లోని యాచకులకు, మొత్తంగా 500 నూతన దుప్పట్లు పంపిణీ చేసి మందిరం వారు మానవత్వం చాటుకున్నారు. సాయినాధుడు ఆచరించి చూపిన మానవసేవలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని మందిరం ఛైర్మన్ మధుసాయి చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులకు బహుమతులు

నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న శ్రీకృష్ణ యోగ మందిరంలో ఆదివారం విద్యార్థులకు గణపతి సచ్చిదానందస్వామీజీ దివ్యనామ సంకీర్తన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులిచ్చారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

## లాఠీ పట్టేవాళ్లు..కలం చేతపట్టారు




పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పోలీసులకు కూడా వ్యాసరచన పోటీలుపెట్టారు. దీంతో లాఠీలు చేతపట్టేవాళ్ళంతా కలం చేతపట్టారు. అనేకమంది పోలీసులు పాల్గొని, బుద్ధిగా చిన్నపిలకాయలు పరీక్షలు రాసినట్టు వ్యాసాలు రాశారు. అక్టోబర్27న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో వ్యాసరచన పోటీ జరిగింది. ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అనేకమంది పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వ్యాసాలు రాయడం విశేషం. ‘పర్యావరణ పరిరక్షణలో పోలీసులకు సవాళ్లు’ అనే అంశంపై జరిగిన ఈ పోటీల ద్వారా, పోలీసులు పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమంలో ఎదురవుతున్న సమస్యలను కూడా పోలీసు ఉన్నతాధికారులు తెలుసుకునే వీలుంటుంది. ఇలా ఉభయతారకంగా..సమాజోపయోగకరంగా పోటీలు నిర్వహించడం పట్ల పోలీసువర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ బి.శ్రీనివాస రెడ్డి, అడ్మిన్ ఆర్‌ఐ హరిబాబు, వెల్ఫేర్ ఆర్‌ఐ రాజారావు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసుసిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యాసాలు బాగా రాసిన వారికి బహుమతులు కూడా ఉంటాయి మరి!..

### కాలధర్మం

## ‘వాసవి’ రమణయ్య



వాసవి రమణయ్యగా ప్రసిద్ధి చెందిన మావిళ్ళపల్లి రమణయ్య నాయుడు అక్టోబర్ 25వ తేదీ శుక్రవారం తమ 91వ ఏట తుదిశ్వాస విడిచారు. నెల్లూరుజిల్లాలో వాసవి రమణయ్యని ఎరుగని పాతతరం రైతు కుటుంబం ఉండదు. కనకమహల్ ప్రాంతంలోని వాసవి మోటార్స్ వ్యవస్థాపకుడిగా రమణయ్య జిల్లా రైతాంగానికి చిరపరిచితులు. వెంకటాచలం మండలం చవటపాలెం రమణయ్యనాయుడి స్వగ్రామం.

దశాబ్దాల క్రితమే రమణయ్య నెల్లూరుకు వచ్చి వాసవి మోటార్స్‌ని స్థాపించి వ్యాపారరంగంలో రాణించారు. మృధుస్వభావిగా, కష్టజీవిగా రమణయ్యకి మంచి పేరుంది. వాసవి మోటార్స్ అంటే నమ్మకానికి మారుపేరుగా ఆయన తన సంస్థని తీర్చిదిద్దారు. ఆయనకి భార్య సీతారామమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె భూదేవి కాగా, రెండవ కుమార్తె ఉమ. పెద్దల్లుడు మువ్వా పద్మయ్య పేరుమోసిన కాంట్రాక్టర్‌గా ఇటు ఆంధ్రాలోనూ అటు తమిళనాడులోనూ అందరికీ సుపరిచితులే. ఆయన రెండవ అల్లుడు రామకృష్ణ నెల్లూరులోనే వ్యాపార రంగంలో ఉన్నారు. రమణయ్య మనుమలు, మనుమరాళ్ళు సైతం ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. రమణయ్య మనుమరాలు పద్మయ్య కుమార్తె డాక్టర్ నీరజ బిందు చిన్నపిల్లల వైద్య నిపుణురాలుగా చెన్నైలోని ‘రెయిన్‌బో చిన్నపిల్లల ఆసుపత్రి’, ‘నెడో చిల్డ్రన్ ఆసుపత్రి’లలో తమ సేవలందిస్తున్నారు. నీరజ భర్త డాక్టర్ రజనీకాంత్ చెన్నైలోని ‘గ్లెనీగ్లోబల్ హాస్పిటల్’లో కాలేయ మార్పిడి విభాగంలో వైద్యసేవలు అందిస్తూ రాణిస్తున్నారు. ప్రఖ్యాత కాలేయ మార్పిడి నిపుణుడిగా, ప్రతిభావంతమైన నెల్లూరు వైద్యుడిగా రజనీకాంత్ నెల్లూరీయులకి బాగా తెలిసినవాడే. రమణయ్య కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలువుతోంది ‘లాయర్’.




## వివిఎస్‌యులో ముగ్గుల పోటీ



ప్రపంచ ఫంగస్ దినోత్సవం సందర్భంగా గతనెల 26న నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ (విఎస్‌యు)లో విద్యార్థినులకు ముగ్గులపోటీ నిర్వహించారు. విఎస్‌యు వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్ విజయభాస్కర్‌రావు తిలకించి విద్యార్థినుల నైపుణ్యాన్ని కొనియాడారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.కె.సునీత, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## క్షయవ్యాధిని నిర్మూలించాలి

జిల్లాలో పూర్తిస్థాయిలో టీబీని నిర్మూలించాలని, నెల్లూరుజిల్లాను టీ.బి (క్షయ)రహిత జిల్లాగా చేయడానికి వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చెప్పారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇటీవల జిల్లాస్థాయి టీ.బి ఫోరం సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, మన దేశంలో 2025 నాటికి టీ.బి నివారించడంతో పాటు, ఆ వ్యాధి వల్ల ఒక్కరు కూడా మరణించకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జిల్లా క్షయ నివారణా అధికారి ఖాదర్‌వలీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అశోక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, జిల్లా కోఆర్డినేటర్ రమేష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

• ఎంపీ వేమిరెడ్డికి.. మరో ఘనత

# విదేశాంగశాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా స్థానం



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్)కి కేంద్రస్థాయిలో మరో అరుదైన ఘనత లభించింది. ఇప్పటికే పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ, ఫైనాన్స్ కమిటీలకు సభ్యుడిగా ఎన్నికైన ఆయన, తాజాగా మరో కేంద్ర కమిటీలో స్థానం సంపాదించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ ఛైర్మన్‌గా ఏర్పాటైన విదేశీ వ్యవహారాల శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా ఆయన ఎన్నిక కావడం విశేషం. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 10 మంది ఎంపీలు, రాజ్యసభ నుంచి 10 మంది ఎంపీలు ఎన్నికైతే, తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాత్రమే ఆ స్థానాన్ని పొందగలిగారు. భారతదేశ విదేశాంగ విధానాలు, కార్యక్రమాలు, పథకాలపై ఆ కమిటీ చర్చిస్తుంది. విదేశీ వ్యవహారాలను మరింత బలోపేతం చేయడంలో తనవంతు పాత్ర పోషిస్తుంది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ వేమిరెడ్డి తన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని తాను ఎప్పటికీ నిలబెట్టుకుంటానని, ఈ కొత్త బాధ్యతలను నెరవేర్చడానికి కూడా తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం..మరో ముందడుగు

## నూతన పారిశ్రామిక విధానంపై.. శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం

రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానాన్ని మరింతగా తెలియజెప్పి, రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలనే ప్రభుత్వ సంకల్పం ఆచరణలోకి వస్తోంది. పరిశ్రమల రంగంలో కీలకమైన సమావేశాలు నిర్వహిస్తూ, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకుపోతోంది. ఈ నేపథ్యంలో, అక్టోబర్ 29న శ్రీసిటీలోని పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం జరిగింది. రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామి పెట్టుబడుల కేంద్రంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి లక్ష్యంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని, కొత్త పారిశ్రామిక విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను, 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా కార్యాచరణను అమలుచేస్తామని రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ చెప్పారు. శ్రీసిటీలోని పరిశ్రమల సీఈఓలు, ఇతర ఉన్నతాధికారులతో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం గురించి మంత్రి కూలంకుషంగా వివరించారు. సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించే ఆంధ్రప్రదేశ్‌ని నిర్మించాలన్నదే ప్రభుత్వ దృక్పథమని ఆయన విశదీకరించారు.



### ఆర్థిక వృద్ధిని పెంచాలన్నదే లక్ష్యం :

'వేగవంతమైన వ్యాపార విధానం' కోసం తీసుకువస్తున్న వివిధ నిర్ణయాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పరిశ్రమల కోసం అవసరమైన మౌలిక సదుపాయాల స్థాపన, అభివృద్ధి, రంగాలవారీగా ప్రోత్సాహకాలతో కూడిన కార్యక్రమాల గురించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ వివరించారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగాలను సృష్టించడం, ఆర్థిక వృద్ధిని పెంచడం రాష్ట్రం లక్ష్యంలో భాగమని ఆయన తెలియజేశారు. సమావేశానికి హాజరైన వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, నూతన పారిశ్రామిక విధానాన్ని కొనియాడారు. శ్రీసిటీ పారిశ్రామిక వర్గానికి నూతన పారిశ్రామిక విధానం, దాని ముఖ్య అంశాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినందుకు పరిశ్రమల మంత్రికి, కార్యదర్శికి ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ చొరవ ప్రపంచ పెట్టుబడులకు రాష్ట్రాన్ని ప్రధాన గమ్యస్థానంగా మార్చడంలో ప్రభుత్వ చురుకైన విధానానికి నిదర్శనమని ఆయన ప్రశంసించారు.

# ఉదయగిరికి..త్వరలోనే మహర్దశ

## ఎమ్మెల్యే కాకర్ల చొరవతో పర్యాటకాభివృద్ధికి పరిశీలనలు



శ్రీకృష్ణదేవరాయల పాలనలో నిర్మించిన శత్రు దుర్భేద్యమైన ఉదయగిరి దుర్గం చరిత్రాత్మకమైనదనే విషయం అందరికీ తెలిసిందే. ఎత్తయిన కొండలు, జలపాతాలు, పచ్చని ప్రకృతి, ఎన్నెన్నో ప్రాచీన ఆలయాలతో ఉదయగిరి జిల్లాలోనే ఒక ప్రత్యేకస్థానం సంపాదించుకుంది. అయితే, ఎంతోకాలంగా నాయకులు దీని అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో కేవలం మెట్ట ప్రాంతంగా, అనేకరకాలైన సమస్యలతో అల్లాడుతోంది. పురాతనకాలం నుంచి ఎంతో ప్రాధాన్యత గల ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వీలున్నప్పటికీ గత వైకాపా ప్రభుత్వం కానీ, స్థానిక నాయకులు కానీ అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఉదయగిరి పట్ల అభిమానమున్న కాకర్ల సురేష్ ఎమ్మెల్యే కావడంతో ఆ ప్రాంతానికి దశ తిరిగింది. ఉదయగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ నిర్ణయించుకోవడమే కాక, అందుకు తగ్గ చర్యలు కూడా తీసుకుంటుండడం పట్ల ఉదయగిరి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి దుర్గంతో పాటు, ఆ పరిసరాల్లో ఉన్న ఆలయాలకు కూడా మహర్దశ రాబోతోంది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు పురావస్తు శాఖాధికారులతో కలిసి ఆర్ అండ్‌బీ డీఈ మదన్‌కుమార్, ఏఇ మస్తాన్‌రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, ఉదయగిరి టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న తదితరులు ఇటీవల దుర్గాన్ని, దుర్గం పరిధిలోని పలు ఆలయాలను సందర్శించారు. ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేయవచ్చో పరిశీలించారు. ఎమ్మెల్యే కాకర్ల చొరవతో త్వరలోనే ఉదయగిరి దుర్గం అభివృద్ధికి బాటలు పడతాయని అందరూ ఎదురుచూస్తున్నారు.

# టీడీపీతోనే..కార్యకర్తలకు సంక్షేమం

## - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



తెలుగుదేశం పార్టీతోనే కార్యకర్తల సంక్షేమం సాధ్యమవుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. కార్యకర్తల త్యాగాల ఫలితంగానే 2024లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిందని, కార్యకర్తలే టీడీపీకి బలమని అన్నారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాలెంలో ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ చేతులమీదుగా తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. అదేవిధంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తరఫునా, తనయుడు అర్జున్‌రెడ్డి తరఫునా ఆమె పార్టీ శాశ్వత సభ్యత్వానికి దరఖాస్తు చేశారు. కార్యకర్తల సంక్షేమానికి సంబంధించి మనదేశంలో రాజకీయ పార్టీలకు తెలుగుదేశం పార్టీ మార్గదర్శకమన్నారు. కార్యకర్తలకు గుర్తింపు కార్డుతో పాటు ప్రమాద బీమా లాంటి సౌకర్యాలను తెలుగుదేశం పార్టీ కల్పించడం దేశవ్యాప్తంగా ప్రశంసలందుకుంటోందన్నారు. కష్టాల్లో వున్న పార్టీ క్యాడర్‌ను ఆదుకునేందుకు 'కార్యకర్తల సంక్షేమ నిధి' ఏర్పాటు చేసిన ఘనత లోకేష్‌బాబుదే నన్నారు. గతంలో రూ.2 లక్షలు ఉన్న ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచడమే కాకుండా, కార్యకర్తల పిల్లలకు చదువు, కుటుంబసభ్యులకు వైద్యం, ఉపాధి లాంటి సౌకర్యాలు కల్పించే రాజకీయపార్టీ దేశంలో టీడీపీ తప్ప మరొకటి లేదన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలుగా చేరి, నాయకులుగా ఎదగాలని ఆమె పిలుపు నిచ్చారు.

పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో..

# 6 నుంచి..'శివలీలా తరంగిణి' సప్తాహం

పద్య సారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబరు 6 నుంచి 12వ తేదీ వరకు 'శివలీలా తరంగిణి' సప్తాహం నిర్వహించనున్నారు. నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ఆనందనిలయం (చక్రవాలవారి ట్రస్ట్) వేదికగా జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతిరోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటలవరకు జరుగుతాయి. సత్యానందాశ్రమం పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థస్వామి, శ్రీ సమయానందనాథ, నలుబోలు బలరామయ్యనాయుడు, ఉచ్చి భువనేశ్వరిప్రసాదులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. 6న ఆలూరు శిరోమణిశర్మ ఆధ్యాత్మికోపన్యాసం, 7న పోలవరపు లక్ష్మీనరసింహారావు, 8న డా. సింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు, 9న అగస్త్యరాజు సుబ్బారావు, 10న డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, 11న కొండెపి మురళీకృష్ణ, 12న డా. కె.గిరిజాలక్ష్మిల ఉపన్యాసాలుంటాయని, ఆధ్యాత్మిక-సాహిత్యాభిమానులందరూ పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తిచేశారు.

## నాగేశ్వరరావు మృతి.. బాధాకరం

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త నిక్కుదల నాగేశ్వరరావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందడం పట్ల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవేదన చెందారు. ఈనెల 29న నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 8 లక్షల రూపాయలను, విపిఆర్ ఫౌండేషన్ ద్వారా మరో అయిదు లక్షలను వెచ్చించి, చెన్నై అపోలో ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించినా నాగేశ్వరరావును కాపాడుకోలేక పోయామంటూ ఆమె బాధపడ్డారు.




## దండం పెట్టి అడుగుతున్నా..

# కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించండి

**• అదానీలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి విన్నపం**




కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణే తన లక్ష్యమని, అదానీలకు దండంపెట్టి మరీ అడుగుతున్నా..దానిని పునరుద్ధరించండంటూ మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు. లేదంటే పోరాటానికి దిగుతామే తప్ప, గత ప్రభుత్వ పాలకుల మాదిరిగా అబద్దాలతో కాలయాపన చేయబోమని స్పష్టం చేశారు. ముత్తుకూరు మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టు వద్ద అక్టోబర్28న అఖిలపక్ష నాయకులతో కలిసి పోర్టు సీఈఓ జగదీష్ పటేల్‌తో ఆయన భేటీ అయ్యారు. కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాల్సిన అవసరాన్ని సీఇఓకి వివరించారు. ఆ తర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎప్పుడో శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రారంభమైన పోర్టును ఇప్పుడు అదానీ యాజమాన్యం మూసివేసే పరిస్థితి తీసుకురావడం ఎంతవరకు న్యాయమని సీఇఓను ప్రశ్నించామని, ఎగుమతులు, దిగుమతులను కాటుపల్లి, ఎన్నూరులకు మార్చి కాలుష్యం వెదజల్లే బొగ్గు, బూడిదను మా ప్రజలపై రుద్దుతారా అని అడిగామని చెప్పారు. కంటైనర్ టెర్మినల్ తరలిపోవడంతో ఇక్కడి రైతుబిడ్డలు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణపట్నం పోర్టు కోసం 6 వేల ఎకరాలు, కృష్ణపట్నం ఎస్ఈజెడ్ కోసం 8వేల ఎకరాలు, రిలయన్స్ ప్రాజెక్ట్ కోసం 2600 ఎకరాలు, కిసాన్ సెజ్ కోసం 2300 ఎకరాలను ఇక్కడి రైతులు త్యాగం చేశారని ఆయన గుర్తుచేశారు. సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత నెల 6న క్రిస్ సిటీకి శంకుస్థాపన చేయాల్సి వుంది.. కానీ వర్షాల కారణంగా వాయిదాపడిందన్నారు. 2600 ఎకరాలతో ఏర్పాటు కాబోతున్న క్రిస్ సిటీ కూడా పోర్టు, కంటైనర్ టెర్మినల్ ఆధారంగానే ఈ ప్రాంతానికి మంజూరయ్యాయన్నారు. ప్రధానమంత్రికి కొత్త పరిశ్రమలతో స్వాగతం పలకాల్సింది పోయి కంటైనర్ టెర్మినల్ మూసేశామని అదానీ చెబుతారా అని ఆయన ప్రశ్నించారు. కంటైనర్ టెర్మినల్ ఇక్కడి నుంచి తరలిపోవడంతో వృత్తి నిపుణులు, పట్టభద్రుల స్థాయి నుంచి లారీ డ్రైవర్ల వరకు 10 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. ఈ ప్రాంత ప్రజలు, రైతులు, రైతుబిడ్డల ప్రయోజనాల కోసం కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలని అదానీ కాళ్లు పట్టుకునేందుకైనా సిద్ధమని, లేదంటే ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని స్పష్టం చేసి వచ్చామన్నారు. 20 రోజుల సమయం ఇస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని జగదీష్ పటేల్ హామీ ఇచ్చారని, అయితే నెల రోజులు కూడా ఎదురుచూస్తాం.. ఆ తర్వాత పరిస్థితులకు అనుగుణంగా అప్పుడు కార్యాచరణ చేపడతామని చెప్పామని, ఉద్యోగాలు కోల్పోయిన యువతకు తిరిగి ఉపాధి కల్పించడం కోసం అందరం ఐక్యంగా పోరాడుతున్నామని సోమిరెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, రవీంద్రరెడ్డి, సంపత్‌కుమార్, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వ బీమా.. కార్యకర్తలకు ధీమా!

**- ఎమ్మెల్యే కాకర్ల సురేష్**



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ఒక బృహత్తర కార్యక్రమమని, టీడీపీ సభ్యత్వం వల్ల కార్యకర్తలకు కేవలం 100 రూపాయలతో 5 లక్షల బీమా వర్తిస్తుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెప్పారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా మొదలైన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వింజమూరు, కలిగిరి మండలాలలో ఇటీవల జరిగిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. తొలుత, వింజమూరు మండలం వెలమ బజార్, కలిగిరి మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయాల్లో జరిగిన సభ్యత్వ నమోదులో పాల్గొని స్థానిక నాయకులు, కార్యకర్తలతో సభ్యత్వ నమోదు చేయించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పడిన తెలుగుదేశం పార్టీలో అన్ని వర్గాల ప్రజలు సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు.

# శ్రీసిటీలో భద్రత భేష్

**అభినందించిన పారిశ్రామిక భద్రతా ప్రమాణాల తనిఖీ బృందం**



విశ్రాంత ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా నేతృత్వంలోని పారిశ్రామిక భద్రతా ప్రమాణాల ఉన్నత స్థాయి కమిటీ ఇటీవల మూడు రోజుల పాటు శ్రీసిటీలో పర్యటించి పలు పరిశ్రమలను తనిఖీ చేసింది. పారిశ్రామిక రంగాలలో భద్రత పట్ల అవగాహనను పెంపొందించడానికి, కార్మికుల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేకచర్యల్లో భాగంగా ఈ కమిటీ అక్కడ పర్యటించింది. కమిటీలోని ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు శ్రీసిటీలోని ప్రధాన పరిశ్రమలైన డైకిన్, డానియెలీ, కింబర్లీక్లార్క్, ఆల్స్టోమ్ లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయా పరిశ్రమలలో ఎలాంటి భద్రతా లోపాలు తమ దృష్టికి రాలేదని మిశ్రా తెలిపారు. ఇప్పటికే అక్కడ పటిష్టమైన భద్రతా చర్యలున్నాయని చెప్పారు. శ్రీసిటీ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పర్యావరణ అనుకూలమైన పద్ధతులు, సమగ్రమైన ప్రణాళికను ఆమె ఈ సందర్భంగా ప్రశంసించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలు నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పాటించడంలో నిబద్ధతను కలిగి ఉన్నాయని, వాటిని మరింత మెరుగు పరచడంలో కమిటీ సిఫార్సులు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. శ్రీసిటీలోని విభిన్న ఉత్పాదక రంగాలలో భద్రతతో పాటు, పర్యావరణ వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయో భద్రతా ప్రమాణాల తనిఖీ బృందం పరిశీలనల ద్వారా స్పష్టమైందని ఆయన తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

**ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**




తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాను జీవితకాలం సభ్యత్వం తీసుకొని పార్టీకి రూ.లక్ష అందిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా అక్టోబర్ 30వ తేదీ గూడూరు ఆదిశంకర కాలేజీలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన పోలీసులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న గూడూరు డిఎస్పీ వి.వి.రమణకుమార్. రూరల్ సి.ఐ.కిషోర్‌బాబు, టూటౌన్ సి.ఐ శ్రీనివాసులు, టౌన్ ఎస్.ఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.**

# మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలి

**జిల్లా ఉపవిద్యాశాఖాధికారి బాలాజీ**



శాస్త్ర, సాంకేతిక ఫలాలు అందరికీ దక్కాలని, ప్రతిఒక్కరూ మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి బాలాజీ అన్నారు. తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఇటీవల జిల్లా చెకుముకి సంబరాలు - 2024 నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మండల స్థాయిలో పోటీల్లో విజేతలుగా నిలిచిన 180 మంది విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, రెడ్డెప్ప, మణికంఠ, మేఘనాథ్, రవికుమార్, దామోదరం, చెంగయ్య, రఫీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలి

**సి. ఐ.టి.యు నాయకులు డిమాండ్**

గూడూరు పురపాలక సంఘంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సి.పి.ఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. అక్టోబర్ 28న గూడూరు పురపాలక కార్యాలయం ఎదుట సి.ఐ.టి.యు అధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే ప్రతి కార్మికుడికి జీవో యం.ఎస్.నెంబర్ 36ని వర్తింపచేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని తెలిపారు. అనంతరం పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. బిల్డింగ్ వర్కర్స్ నాయకులు పుట్ట శంకరయ్య, సి.ఐ.టి.యు పట్టణ కార్యదర్శి సురేష్, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# జానకిరామ.. రామాయణం (37)

- ఊటుకూరు జానకి రామారావు

రామచంద్రుడు మార్గంలో సీతమ్మకు వనశోభను చూపిస్తూ... సీతా! చూశావా ఈ కింశుక వృక్షాలు! వాటిపూలను అవే మాలలు గ్రుచ్చి వేసుకొన్నట్లుగా ఉంది. ఎఱ్ఱటిపూలతో మంటపెట్టినట్లుగా ఉంది.

శిశిరం వెళ్లిపోయింది. అందుకే అడవంతా విరగబూసింది. సీతా ఇటు చూడు, ఈ భల్లాత(జీడి) వృక్షం పూలు పండ్లతో భారం మోయలేక వంగిపోయి ఉంది. ఇవి అందించే మధుర ఫలాలను తినడానికి నరులెవ్వరూ ఇక్కడ లేరు కదా!

లక్ష్మణా! అదుగో చూశావా... ప్రతిచెట్టుమీదా తేనెపట్టు ఉంది. ప్రతి తేనెపట్టు ఎంతో పెద్దగా ఉండి నేలను తాకుతున్నట్లుగా ఉన్నాయి.

ఎక్కడ చూసినా పూలే! నేల అంతా పరుచుకొని రహదారిని కప్పివేసి సున్నితమైన సీతమ్మ పాదాలకు రక్షణగా ఉన్నాయవి.

వానకోయిల కూస్తుంటే.. దానికి సమాధానంగా నెమలి క్రేంకారం మనోహరంగా శ్రవణానందకరంగా ఉంది. వనమంతా పక్షుల కూజితాలతో సందడిసందడిగా ఆహ్లాదకరంగా ఉంది.

ఎదురుగా ఎత్తైన శిఖరాలతో చిత్రకూటం కనపడుతోంది. దానిమీద గుంపులు గుంపులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి.

లక్ష్మణా.. మనోహరమైన ఈ గిరిశిఖరాలమీద ఉండాలనే ఉత్సాహం ఊరిస్తున్నదయ్యా! అందాలుచిందించే ఈ చోటు కంటికి బహుపసందైన విందుగా కనిపిస్తోంది. ఈ తరులు, ఈ గిరులు ఎంత రమణీయంగా ఉందో ఈ ప్రదేశం.

ఇక్కడే మనం నివాసం ఏర్పరచుకొని సుఖంగా జీవించవచ్చు.

ఆ ప్రదేశంలో ఎందరో మునులు స్థిరనివాసం ఏర్పరచుకొని తాపసవృత్తిలో జీవిస్తున్నారు. వారందరినీ చూశారు వారు.

ముందుగా వాల్మీకి మహర్షి ఆశ్రమం చేరుకొని ఆ మహానుభావుడికి నమస్కరించి వినయంగా నిలుచున్నారు ముగ్వురు. వారి ఆగమనానికి మహర్షి ఆనందించి, వారిని తగురీతిగా సత్కరించి కూర్చోమని ఉచితాసనాలిచ్చినాడు.

రాముడు తమను తాము మహర్షికి పరిచయం చేసుకొని తమ రాకకు గల కారణాన్ని మహర్షికి తెలిపి, లక్ష్మణుని వైపు తిరిగి, లక్ష్మణా మనం ఇక్కడ నివసించటానికి యోగ్యమైన ఒక గృహాన్ని నిర్మించాలి, అందుకు కావలసిన సామాగ్రిని సేక రించమని కోరాడు.

అన్నగారు కోరిందే తడవుగా మంచి దృఢమైన వృక్షశాఖలు తెచ్చి చక్కటి స్థిరమైన పర్ణశాల నిర్మించాడు లక్ష్మణుడు. మెత్తటి చాపలల్లి విశాలమైన ఆవరణం ఏర్పరచి అన్న ఎదుట సావధానచిత్తుడై నిలిచాడు లక్ష్మణుడు.

అందంగా నిర్మింపబడిన ఆ పర్ణశాలను చూస్తూ రామచంద్రుడు, లక్ష్మణా.. ఈ పర్ణశాలలో మనం చాలాకాలం జీవించవలసి ఉంటుంది. కావున ప్రవేశించే ముందు వాస్తుదేవతా శాంతి చేసుకోవాలి. అందు నిమిత్తమై నీవు లేడిమాంసం తీసుకొనిరా, శాలాపూజ చేసుకుందాం. శాస్త్ర విహితమైన కార్యం కదా!

రాముడినోట మాటవెలువడిన మరుక్షణమే అక్కడ కృష్ణసారం అనే లేడిమాంసం సిద్ధంచేశాడు లక్ష్మణుడు.

రామా! ఇక దేవతాపూజ ప్రారంభించవచ్చు అని తెలిపాడు.

ఒక స్థిరముహూర్తంలో రాముడు శుచిగా నదిలో స్నానం చేసినవాడై దేవతలను, రుద్రుని, విష్ణువును ఉద్దేశించి బలులు సమర్పించి వాస్తుశాంతి నిమిత్తమై మంగళాలు చేసి నియమానుసారంగా వాస్తుపూజా సమయంలో పఠించవలసిన మంత్రాలు స్వయంగా తానే చదివి పర్ణశా లలో ప్రవేశించగనే ఆయన మనస్సులో అమితమైన ఆనందం కలిగింది.

అంత సీతారామలక్ష్మణులు అడవిలోదొరికే పూలు, పండ్లు కంద మూలాలు, పక్వమైన మాంసంతో సకల భూతములకు తృప్తి కలుగచేశారు.

లక్ష్మణుడు ఆ పర్ణశాలలో వేదికలు, చైత్యములు, అగ్ని గృహాలు కూడా ఏర్పాటు చేశాడు.

మనోహరమైన చిత్రకూట పర్వతసానువులు, మాల్యవతీ నది, రమణీయమైన ప్రకృతి, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మింపబడిన ఆ పర్ణశాలలో ప్రవేశించగనే అయోధ్యను విడవటం వలన వారిలో కలిగిన దుఃఖం మటుమాయమయ్యింది.

అక్కడ!..

రాముడు గంగదాటినవైపే వారు కనుమరుగయ్యేంతవరకు చూస్తూ నిలుచున్న సుమంత్రుడు, రాముడు చిత్రకూటం చేరుకున్నాడన్న వార్త తెలిసేవరకు గుహుని వద్దనే ఉండి భారమైన మనస్సుతో ఆనందశూన్యమైన అయోధ్య చేరాడు.

సుమంత్రుని చూడగనే రాముడెక్కడ? మా రాముడెక్కడ? అంటూ నగర ప్రజలందరూ ఆయన చుట్టూ గుమికూడి ప్రశ్నలవర్షం కురిపించారు.

రాముడు గంగదాటి అడవులలోకి వెళ్ళిపోయాడనే వార్త అయోధ్య ప్రజలలో హాహాకారాలు పుట్టించింది. మరొక్కసారి రోదనలు మిన్నుముట్టాయి.



సుమంత్రుడు మెల్లగా రాజప్రాసాదంలోకి ప్రవేశించాడు. అక్కడ సర్వం కోల్పోయినవాడిలా దీనుడై, దుఃఖితుడై, కాంతిహీనుడై చతికిలపడి కూర్చున్న దశరథుడిని సమీపించాడు.

రాజుకు నమస్కరించి రాముడి వనప్రవేశ వృత్తాంతం వినిపించాడు.

అది మౌనంగా విని ఒక్కసారిగా మూర్ఛిల్లి నేలమీద దబ్బున పడిపోయాడు మహారాజు.

కౌసల్యా సుమిత్రలు పరుగుపరుగున వచ్చి ఆయనను లేవదీసి మంచంమీద పరుండబెట్టి ఓ రాజా... ఎందుకంత మౌనంగా ఉన్నావయ్యా! జరుగరానిది జరిగిపోయింది. ఇప్పుడు నీవు బాధపడి ఏం ప్రయోజనం! అదుగో సుమంత్రుడు వచ్చాడు. రాముడి వార్తలు చెపుతాడు. లేచి వినవయ్యా అంటూ దుఃఖం వలన చపల అయిన కౌసల్య డగ్గుత్తికతో మాట్లాడుతూ తాను కూడా నేలపై ఒరిగిపోయింది.

కొంతసేపటికి తేరుకున్న దశరథుడు సుమంత్రుని పిలిచి, నా రాముడు ఎలా ఉన్నాడు? ఏమి తింటున్నాడు? ఎక్కడ పడుకున్నాడు? అడవి అంతటా క్రూరమృగాలు, కృష్ణసర్పాలతో నిండి ఉంది గదా..వారు ఎలా ప్రయాణిస్తున్నారు. సుకుమారి సీత ఈ కష్టాలు ఎలా ఓర్చుకుంటున్నది? అని అంటూ రాముడి గురించి ప్రశ్నలవర్షం కురిపిస్తూనే ఉన్నాడు.

సుమంత్రుడు, రాముడు తండ్రి క్షేమమే కోరుకుంటున్నాడు అన్న విషయం, భరతునిపట్ల ఆయనకు గల ప్రేమను కూడా మహారాజుకు తెలిపి, లక్ష్మణ కుమారుడి కోపం గురించి కూడా తెలియచేశాడు.

ప్రభువుగా ముందువెనుకలు ఆలోచించకుండా ఏ నేరం చేయని రాముని అడవులకు వెళ్ళగొట్టడం తెలివితక్కువవాడు చేసేపని. నేను ఇకనుండీ ఆయనను తండ్రిగా పరిగణింపను.నాకు సోదరుడైనా, బంధువైనా, హితుడైనా, రాజైనా, తండ్రైనా రాముడే అని చెప్పాడు ప్రభూ!.


.. (సశేషం)

# పుస్తక పరిచయం

# లోతైన అధ్యయనం.. చరిత్రాత్మక ప్రసంగాల సంకలనం.. 'మండలిలో మాస్టారు'

అనేక సామాజిక, విద్యారంగాల అంశాలపై లోతైన అధ్యయనంతో, తన ప్రసంగాలను ఒక చరిత్రాత్మక ఉపన్యాసాలుగా చేసి.. నేటి తరానికే కాక, భావి తరాలకు కూడా ఒక దిక్సూచిగా నిలిపిన సారస్వతవేత్త, గొప్ప చదువరి, సామాజిక ఉద్యమకారుడు, శాసనమండలి సభ్యుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం గారు. జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు మంచిపేరు. వి.బి.యస్‌గా పిలవబడే విఠపు బాలసుబ్రహ్మణ్యం శాసనమండలి సభ్యుడిగా దాదాపు 16 సంవత్సరాల సుదీర్ఘకాలం పనిచేసి, నిర్విరామ కృషితో ఎన్నో అంశాలపై స్పందించి శాసన మండలిలో తన గళాన్ని అనర్ఘళంగా వినిపించారు. ఆయన స్వస్థలం నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలంలోని 'మాముడూరు' గ్రామం. 2007లో చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గం నుంచి, ఆ తర్వాత 2011, 2017లోనూ ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి వరుసగా ఎమ్మెల్సీగా విజయం సాధించడం ఆయనకు ప్రజల పట్ల, ప్రజలకు ఆయన పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనం. పదహారేళ్ళపాటు శాసన మండలి సభ్యుడిగా ఉన్న విబియస్, ప్రోగ్రెసివ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఫ్లోర్‌లీడర్‌గా, ప్రొటెం ఛైర్మెన్‌గా కూడా గురుతరమైన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహించారు. శాసన మండలిలో ఆయన చేసిన అద్భుత ప్రసంగాలు రాష్ట్రస్థాయిలో ప్రజలను, నాయకులను సైతం ఆకట్టుకున్నాయి. వాటన్నిటినీ ఎంపికచేసి, ఆ తర్వాత జనవిజ్ఞాన వేదిక ద్వారా 'మండలిలో మాస్టారు' పేరుతో ఒక పుస్తకంగా మనకందించారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదొక చారిత్రిక గ్రంథం. సుదీర్ఘకాలం శాసనమండలిలో ఆయన ప్రసంగాలు.. అనుభవాలు ఇందులో ఉన్నాయి.

'రాజమండ్రిలో పెట్టిన యూనివర్సిటీకి నన్నయ పేరు పెట్టారు. ఒంగోలులో యూనివర్శిటీకి ఎర్రన పేరు, కడపలో వేమన పేరు పెడుతున్నారు. కానీ కవి త్రయంలో అతిముఖ్యుడు, భారతంలో 15 పర్వాలు రాసిన తిక్కన పేరును నెల్లూరు యూనివర్శిటీకి పెట్టకపోవడం ఆవేదన కలిగిస్తోందని ఆయన అంటూ, తిక్కన చేసిన పాపం ఏమిటి?.. నెల్లూరులో పెట్టే యూనివర్శిటీకి 'తిక్కన విశ్వ విద్యాలయం' అని ఎందుకు పేరు పెట్టలేదని 28.08.2008న శాసనమండలి సభలో ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. మరో సందర్భంలో ప్రైవేట్ విద్య కంటే ప్రభుత్వ విద్య ఎంత ప్రయోజనకరంగా ఉంటుందో చెప్తూ, 'సర్వేపల్లి రాధాకృష్ణన్, కట్టమంచి రామలింగారెడ్డి ఆంధ్రా యూనివర్శిటీకి వైస్‌ఛాన్సలర్స్‌గా ఉన్నారు. ఆంధ్రా యూనివర్శిటీలో ఎకనమిక్స్ డిగ్రీ తీసుకుంటే అంతర్జాతీయ గుర్తింపు ఉండేది. ఈ దేశంలోని గొప్ప శాస్త్రవేత్తలందరినీ తయారుచేసింది ప్రభుత్వ విశ్వ విద్యాలయాలే! ఒక్క ప్రైవేటు యూనివర్శిటీ కూడా ఒక యూ.ఆర్.రావునో, ఒక హోమీబాబానో తయారుచేసిన దాఖలా లేదు'.. అంటూ ఆయన చేసిన ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది. అదేవిధంగా ఇంకో సందర్భంలో, సి.పి.యస్‌ను రద్దు చేయాలి అంటూ 'ఇప్పటికీ భారతదేశంలో త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానమే కొనసాగుతోంది. ఆ రాష్ట్రాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానాన్ని తీసుకుని రావాలి. సభలో ఇద్దరు మంత్రులున్నారు. వీరిని ఆమేరకు మాకు హామీ ఇవ్వాలని అడుగుతున్నాను. ఆ హామీ లభించేంతవరకు సభ వాయిదా వేయాలని కోరుతున్నాను'.. అని సభలో కోరడం ఆయన నిబద్ధతకు ప్రతీక అని చెప్పవచ్చు. వీటికంటే మిన్నగా, రాష్ట్ర విభజన సమయంలో ఆయన చేసిన ప్రసంగం అందరి హృదయాలను హత్తుకుంటుంది. సామాన్యప్రజలను సైతం కంటతడి పెట్టిస్తుంది. తెలుగువాళ్లను ఒక పథకం ప్రకారం విడగొడతున్నారంటూ విబియస్ ఎంతో ఆవేదన చెందారు. ఆక్రోశించారు. విభజనకు వ్యతిరేకంగా గొంతెత్తి నినదించారు. 'రాష్ట్రం విడిపోతే పేదలు నష్టపోతారు. నష్టపోయేది శ్రామిక వర్గం. నష్టపోయేది కష్టజీవులు. వాళ్ల పోరాటశక్తి తగ్గుతుంది. వాళ్ళు ముక్కలు ముక్కలైపోతారు. ప్రాంతాల పేరుతో నేడు వాళ్ళను విడగొడుతున్నారు. రేప్పొద్దున గొంతెత్తి మాట్లాడాలంటే నిలబడ లేని పరిస్థితులు వాళ్ళకి కల్పిస్తారు. ఈ బాధాకరమైన సందర్భాలు అనేకం మాకు తెలుసు'.. అంటూ ఆయనెంతో బాధను వ్యక్తంచేశారు. అందువల్లనే రాష్ట్ర విభజనను గానీ, ఆ ప్రయత్నాన్ని గానీ మేము నిర్ద్వంద్వంగానే వ్యతిరేకిస్తున్నామంటూ నిక్కచ్చిగా చెప్పేశారాయన తన ప్రసంగంలో. విభజన తర్వాత కూడా ఆయన మన విద్యారంగం దుస్థితిని తూర్పారబడుతూ, 'రాష్ట్రం విడిపోయాక, బడికెళ్లే వయసులోని పిల్లలు 86.50 లక్షలున్నారు. బడిలో 73.37 లక్షల మంది ఉన్నారు. అంటే.. బడిబయట 13.13 లక్షలమంది ఉన్నారన్నమాట. 13 జిల్లాల రాష్ట్రంలో 13 లక్షలమంది 'బడి బయట' ఉండడం ఏ అభివృద్ధికి సూచిక.. అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇలాంటి వాస్తవిక, శాస్త్రీయ దృక్పథంతో ఆయన చేసిన చరిత్రాత్మక ప్రసంగాలెన్నో ఈ పుస్తకంలో ఉన్నాయి.



మండలిలో మాస్టారు


రచయిత:
విఠపు బాలసుబ్రహ్మణ్యం
పేజీలు : 400 వెల : 200/-
ప్రతులకు:
వి.బాలసుబ్రహ్మణ్యం
27-1-1304, బాలాజీ నగర్,
నెల్లూరు - 2. సెల్ : 94900 98912.

గతం భవిష్యత్తుకు మెట్టు లాంటిది. ఒక్కో మెట్టు ఎక్కుతూ భావితరాన్ని వెలుగుబాటలోకి నడిపించడానికి ఇలాంటి గ్రంథాలు దారిదీపాలవుతాయి. ప్రజలకు, నాయకులకు, ఉద్యమకారులకు, మొత్తంగా నేటితరానికే కాక భవిష్యత్‌తరాల వారికి కూడా ఈ గ్రంథం ఒక కరదీపికగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అనేక ఉద్యమాల్లో ఆరితేరిన యోధుడు, అవిశ్రాంత అక్షర ఉద్యమకారుడు అయిన విబియస్.. శాసనమండలిలోనూ ఒక మాస్టారుగా బెత్తం పట్టుకుని మరీ పాఠాలు చెప్పినట్లుగా ఎన్నో విషయాలు చెప్పారు. ప్రభుతను, ప్రజలను మేల్కొల్పాలనే తపనతో సభా సమరాలు.. అక్షర యుద్ధాలెన్నో సాగించి తనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చారు. దాన్ని క్లుప్తంగా, అందంగా 400పేజీల పుస్తకంగా మనకందించారు. ఆ ఉపన్యాసాలను చదువుకోవడం, వాటి నుంచి సామాజిక పరిజ్ఞానాన్ని అందుకోవడం పాఠకులుగా.. మనవంతు.



పరిచయకర్త :
డా. గంగిశెట్టి శివకుమార్
నెల్లూరు. సెల్: 9441895343.

# కళ్యాణ వైభవం...!




గోడపర్తి సుబ్బానాయుడు - శ్రీమతి సత్యవతిల కుమారుడు **శభరీష్ - పుష్ప** ల కళ్యాణం అక్టోబర్ 27వ తేదీ వెంకటాచలం, స్వర్ణభారత్ ట్రస్టులోని ప్రజామందిరంలో వైభవంగా జరిగింది. భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి శ్రీమతి ఉషమ్మతో పాటు స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ యిమ్మణ్ణి దీపా, వెంకట్, విష్ణులతో పాటు వెంకయ్య కుటుంబసభ్యులు, ఇరు కుటుంబాల బంధుమిత్రులు ఈ కళ్యాణ వేడుకలో పాల్గొని కొత్త దంపతులను దీవించారు. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# వైసీపీ ఖాళీ అవుతుందా?

(మొదటిపేజీ తరువాయి)

తాను పోటీచేసిన రెండు స్థానాల్లోనూ ఘోర పరాజయం పొందాడు పవన్ కళ్యాణ్. ప్రతిపక్షాలు పవన్‌ని ప్యాకేజీ స్టార్ అన్నాయి. దత్తపుత్రుడని హేళన చేశాయి. ఆయన వ్యక్తిగత జీవితంపై సామాజిక మాధ్యమాల ద్వారా దాడిచేశాయి. సాక్షాత్తూ ఆనాటి ముఖ్యమంత్రి సైతం పవన్ పెళ్ళిళ్ళ గురించి ఎద్దేవా చేశారు. కానీ, పవన్ ఎక్కడా నిరుత్సాహపడలేదు. రాజకీయాలని వదల్లేదు. తాను సాధించాలనుకున్న లక్ష్యం వైపునుండి పక్కకి చూడలేదు. 2024 ఎన్నికలలో వ్యతిరేక ఓటు చీలనీయం అంటూ ప్రతి సభలోనూ చెప్తూ వచ్చారు. ఎన్నికలనాటికి తాననుకున్నది సాధించారు. బీజేపీని టీడీపీతో జతకట్టేలా మంతనాలు జరిపారు. మూడు పార్టీలు కలసి కూటమిగా ఏర్పడేలా ఒప్పందాన్ని కుదిర్చి ఎన్నికల కదనరంగంలో దూకారు. దేశంలోనే నూటికి నూరు శాతం విజయం సాధించిన తొలి పార్టీగా ఘనతకెక్కేలా, పోటీచేసిన మొత్తం 22స్థానాలలో విజయం సాధించారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా మంచి పేరు తెచ్చుకుంటున్నారు. జనసేన పార్టీని బలోపేతం చేసేలా వ్యూహాత్మక అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నారు.

## ఆపరేషన్ ఆకర్ష్!

మాములుగా రాజకీయాలలో ఆపరేషన్ ఆకర్ష్ అన్నది సర్వసాధారణం. అధికారంలోకి వచ్చిన పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నవారిని లాక్కునే ప్రయత్నంలో చేసేదే "ఆపరేషన్ ఆకర్ష్". ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న బీజేపీ – టీడీపీ – జనసేన పార్టీలు అలాంటి ప్రయత్నాలు చేయకపోయినా వైసీపీ నేతలే ఇతర పార్టీలలో చేరడానికి రాయబారాలు పంపిస్తున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యంగా ఎక్కువమంది వైసీపీ నేతలు జనసేన పంచన చేరడానికి మొగ్గుచూపుతున్నారని కూడా రాజకీయవర్గాల సమాచారం. తెలుగుదేశంలో చేరలేక కాంగ్రెస్‌పార్టీలో ఉండలేక వైసీపీ నీడన చేరిన ఎక్కువమంది లీడర్లు జనసేన, బీజేపీల వైపు చూస్తున్నారని వైసీపీ శ్రేణులే చెప్పడం విడ్డూరం. వైసీపీ, జనసేనలతో పోలిస్తే భవిష్యత్తులో జనసేన బలమైన పార్టీగా అవతరించబోతోందనే సంకేతాలు స్పష్టంగా వస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. వైసీపీలో ఉచ్ఛం నీచం లేకుండా దిగజారుడు భాషతో అటు చంద్రబాబుని, ఇటు పవన్‌కళ్యాణ్‌ని విమర్శించిన రౌడీమూక తప్ప విలువలు కలిగిన రాజకీయవేత్తలు ఎవరూ మిగలరని ఓ వైసీపీ నేత జోస్యం చెప్పారు. చౌకబారు మాటలు మాట్లాడే వీధి గూండాలని పక్కన పెట్టుకుని వాళ్ళని ప్రోత్సహించిన జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలో చివరికి వాళ్ళైనా మిగల్తారా లేదా అన్నది ప్రశ్నార్థకమని విశ్లేషకులు తమ అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

తమ పార్టీ నాయకుడు జనసేనాని ఆచితూచి అడుగేస్తున్నాడని, ఆయన గేట్లు తెరిస్తే వలసలు వరసపెడతారని జనసైనికులు చెప్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన చాలామంది సీనియర్లు జనసేన తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధంగా వున్నారని కూడా అంటున్నారు. ధర్మాన, బొత్సా, విడదల రజనీతో పాటు రోజా సైతం తమ నాయకుడు సందిస్తే దూరడానికి రెడీగా ఉందని జనసైనికులు చెప్తున్నారు. పార్టీలో ఉత్తరాంధ్రలో అంతమంది సీనియర్లు ఉండగా తమ పార్టీని, జగన్ ప్రతిష్టని దిగజార్చిన విజయసాయిరెడ్డికే మళ్ళీ విశాఖ, శ్రీకాకుళం బాధ్యతలు అప్పజెప్పడం వెనుక అర్థమేమిటో వైసీపీ నేతలే వూహించుకోవచ్చని కూడా రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. సీనియర్లు ఉంటారా వెళ్తారా అన్న స్పష్టత లేకపోవడంతోనే జగన్ మళ్ళీ ఏ2కే ఉత్తరాంధ్ర బాధ్యతలు ఇచ్చారని అనిపించడం లేదా...? అని ప్రశ్నిస్తున్నాయి. అటు విశ్లేషకులు, ఇటు ఈ మూడు పార్టీల నాయకులు చెప్తున్న మాటలు వాస్తవరూపం దాలిస్తే వైసీపీ ఖాళీ అయిపోవడం ఖాయమని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి!

# టీటీడీ ఛైర్మన్‌గా బి.ఆర్.నాయుడు




12.07.2024 నాటి 'లాయర్' సంచిక

*ఎట్టకేలకి దీపావళి కానుకగా తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలిని ప్రభుత్వం ప్రకటించింది. ఊహించినట్లుగానే 'లాయర్' మాటే నిజమైంది. టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా ఎవరు ఉండబోతారనే ఉత్కంఠ భరితమైన చర్చోపచర్చలు జరుగుతున్న రోజుల్లోనే.. ఈ ఏడాది జులై 12వ తేదీ 'లాయర్' సంచికలో, మొదటిపేజీలోనే బీఆర్ నాయుడు ఫోటోతో సహా వేసి, టీటీడీ ఛైర్మన్‌గా 'టీవీ5 నాయుడు' (బొల్లినేని రాజగోపాల్‌నాయుడు) పదవి చేపడతారని, ఆమేరకు రంగం సిద్ధమవుతోందని కూడా స్పష్టం చేసింది. ఆయన చిత్తశుద్ధిని, దైవభక్తిని తెలిసిన వాళ్ళంతా టీటీడీకి అలాంటి దైవగుణసంపన్నులే ఛైర్మన్‌గా ఉండాలని ఆకాంక్షించారు కూడా. అందరికీ అభిమాన పాత్రుడు, ప్రత్యేకించి స్వతహాగా ధర్మరక్షకుడు.. హిందూధర్మానికి పరిరక్షకుడు బీఆర్ నాయుడే టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా ఎంపికకావడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చిత్తూరుజిల్లాకు చెందిన బీఆర్ నాయుడుతో పాటు పాలకమండలి సభ్యులు కూడా శ్రీవారిపై అపారమైన భక్తిశ్రద్ధలున్నవారే కావడం విశేషం.*

బీఆర్ నాయుడంటే ధర్మనిరతికి మారుపేరు. స్వతహాగా ఆయనో సామాజిక, ఆధ్యాత్మిక సేవాపరాయణులు. టీవీ5 వంటి ప్రముఖమైన ఛానెల్‌కు ఛైర్మన్‌గా, ప్రత్యేకించి 'హిందూ ధర్మం' అనే ఆధ్యాత్మిక ఛానెల్‌కు అధిపతిగానే కాక, వ్యక్తిగతంగా కూడా ఎన్నో దైవకార్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి హిందూ ధర్మం పట్ల తనకున్న అభిమానాన్ని, నిబద్ధతను చాటుకున్నారాయన. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ఏడుకొండల వెంకన్న అంటే ఆయనకు ప్రాణం. ఆధ్యాత్మికతత్వమన్నా.. వేదాలు, ఉపనిషత్తులు, హిందూ ధర్మశాస్త్రాలన్నా ఆయనకు ఎనలేని అభిమానం. ఆ సద్గుణాలే ఆయన్ను టీటీడీ బోర్డు ఛైర్మన్ పదవికి ఎంపిక చేశాయి.

## శ్రీవారి సేవకు.. మళ్ళీ ప్రశాంతమ్మ

నెల్లూరుజిల్లాలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించాలన్నా నేనున్నానంటూ ముందుకొచ్చే నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మూడవసారి పాలకమండలి సభ్యురాలిగా అవకాశం లభించింది. ఆమె గత ప్రభుత్వంలో రెండు పర్యాయాలు టీటీడీ బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తర భారతదేశ సలహా మండలి అధ్యక్షురాలిగా కూడా ఆమె అనేక ప్రతిష్టాత్మకమైన స్వామివారి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వైభవోత్సవాలతో పాటు అనేక ధార్మిక సేవా కార్యక్రమాలకి వేమిరెడ్డి దంపతులు సారథులుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ప్రశాంతిరెడ్డికి మూడోసారి టీటీడీ పాలక మండలి సభ్యురాలిగా అవకాశం రావడం పట్ల వీపీఆర్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. తనపై నమ్మకంతో స్వామివారి సేవకోసం తనని ఎంపిక చేసిన చంద్రబాబు నాయుడికి, పవన్ కళ్యాణ్‌కి, లోకేష్‌కి ప్రశాంతిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## పనబాక లక్ష్మికి అవకాశం

జిల్లా రాజకీయ చరిత్రలోనే పది సంవత్సరాల పాటు కేంద్ర సహాయమంత్రిగా సేవలందించిన పనబాక లక్ష్మికి తిరుమల తిరుపతి దేవస్థానాల సభ్యురాలిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవకాశం కల్పించారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌పార్టీలో కొనసాగిన పనబాక ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019 ఎన్నికలలో తిరుపతి పార్లమెంటు అభ్యర్థిగా ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుండి ఆమె తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు. వైసీపీలో చేరాల్సిందిగా అనేక పర్యాయాలు అవకాశాలు వచ్చినప్పటికీ ఆమె మొగ్గుచూపలేదు. పార్టీ పట్ల ఆమె చూపిన విధేయతకు గుర్తుగా నేడు శ్రీవారి సేవ చేసుకునే భాగ్యాన్ని చంద్రబాబు కల్పించారు.

ఛైర్మన్ బి.ఆర్.నాయుడుకి, నెల్లూరుజిల్లా నుండి పాలకమండలిలో సభ్యురాళ్ళుగా ఎంపికైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పనబాక లక్ష్మిలకి 'లాయర్' అభినందనలు.

## కొత్త పాలక మండలి ఇదే...

బి.ఆర్.నాయుడు, ఛైర్మన్‌గాను... జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు శాసనసభ్యురాలు), ఎం.ఎస్ రాజు (మడకశిర శాసనసభ్యులు), పనబాక లక్ష్మి (కేంద్ర మాజీ మంత్రి), జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నూరి నర్సిరెడ్డి (తెలంగాణ), సదాశివరావు నన్నపనేని, కృష్ణమూర్తి ( తమిళనాడు), కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్.ఆర్.ఎన్ (కర్ణాటక), జస్టిస్ హెచ్‌ఎల్ దత్ (కర్ణాటక), శాంతారామ్, పి.రామ్మూర్తి (తమిళనాడు), జానకీ దేవి తమ్మిశెట్టి, బూంగునూరు మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీ, బూరగాపు ఆనందసాయి, సుచిత్ర ఎల్ల (తెలంగాణ), నరేశ్‌కుమార్ (కర్ణాటక), డా. అదిత్ దేశాయ్ (గుజరాత్), సౌరబ్ హెచ్ బోరా (మహారాష్ట్ర) సభ్యులుగా నియమింపబడ్డారు.

# ఎన్‌బికెఆర్‌లో..ఘనంగా ఆవిష్కార్-2కె24

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో అక్టోబర్ 29న ప్రతిష్టాత్మకంగా ఆవిష్కార్–2కె24 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. ఐఇటీఇ విద్యార్థి ఫోరం, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో వివిధ కళాశాలల నుండి 300 మందికి పైగానే విద్యార్థులు పాల్గొన్నారు. కన్వీనర్ ప్రొఫెసర్ బి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో, కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, డా. కె.నాగిరెడ్డి సదస్సును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, క్విజ్, సెల్ఫీ గేమ్, మెమొరీ గేమ్ తదితర పోటీలు నిర్వహించారు. ఇలాంటి పోటీల వల్ల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెరుగుతుందని డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి చెప్పారు.



## విజేతలు వీరే...

ఈ పోటీల్లో భాగంగా పోస్టర్ ప్రదర్శనలో టి.లహరి, పి.సాయిప్రియ (జీఐఎస్టీ) ప్రథమ బహుమతిని, ఎస్.వైష్ణవి, ఎస్ విష్ణుప్రియ (ఎన్‌బికెఆర్ ఐఎస్టీ) ద్వితీయ బహుమతిని సాధించారు. అదేవిధంగా, పేపర్ ప్రెజెంటేషన్‌లో ఇ. అభిజిత్ (ఎన్‌బికెఆర్ ఐఎస్టీ) ప్రథమ బహుమతిని, టి.లహరి, పి.సాయి ప్రియ (జీఐఎస్టీ) ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో కె.మురలీధర్, టి.దినేష్, ఇ.పృధ్వి (ఎన్‌బికెఆర్ ఐఎస్టీ)లు ప్రథమ బహుమతిని, ఎన్.శ్రావంతి, సాయి సునీతకుమారి (ఎన్‌బికెఆర్ ఐఎస్టీ) ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. క్విజ్‌లో ఆర్.హైమవతి, తేజస్విని, కె.పూర్ణిమ, పి.లక్ష్మీప్రియ, ఎన్.శ్రుతి, బి.అలేఖ్య (ఎన్‌బికెఆర్ ఐఎస్టీ)లు ప్రథమ బహుమతిని, ఎస్ వైష్ణవి, ఎస్ విష్ణుప్రియ (ఎన్‌బికెఆర్ ఐఎస్టీ) ద్వితీయ బహుమతిని పొందారు. మెమొరీ పవర్ పోటీలో కె.గణేష్, ఎం.హర్షవర్ధన్ (ఎన్‌బికెఆర్ ఐఎస్టీ), సెల్ఫీగేమ్‌లో బి.వెంకటపవన్‌కుమార్, ఆర్.ప్రదీప్‌లు బహుమతులు గెలుచుకున్నారు. విజేతలను కళాశాల డైరెక్టర్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

# కొత్త అధికారులొచ్చారు

## డీఇఓగా బాలాజీరావు, డీఆర్ఓగా ఉదయభాస్కర్‌రావు




జిల్లాకు కొత్త డీఇఓ, డీఆర్ఓలు వచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఇఓ)గా ఇక్కడున్న పీవీజే రామారావును కృష్ణాజిల్లాకు బదిలీచేసి, పల్లిపాడు డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకునిగా ఉన్న డా. రాజా బాలాజీరావును డీఇఓగా నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. బాలాజీరావు స్వస్థలం ప్రకాశం జిల్లా కొండెపి మండలం నెన్నూరుపాడు గ్రామం. 1995లో లింగసముద్రం జడ్పీస్కూల్‌లో లెక్కలయ్యోరుగా పనిచేసి, 2002లో ప్రమోషన్‌పై నెల్లూరుజిల్లాకు వచ్చారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో ఉన్న డైట్ కళాశాలలో అధ్యాపకునిగా ఇన్నేళ్ళుగా విధులు నిర్వహిస్తూ, సీనియర్ అధ్యాపకునిగా ఉన్న ఆయన్ను డీఇఓగా నియమించారు. ఈనెల 25న ఆయన నెల్లూరులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి, అనంతరం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్ఓ)గా ఉన్న లవన్నను సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశిస్తూ, పశ్చిమ గోదావరి జిల్లాలో డీఆర్ఓగా పనిచేస్తున్న ఉదయభాస్కర్ రావును నెల్లూరులో డీఆర్ఓగా నియమించారు. సాధారణ బదిలీలు, నియామకాల్లో భాగంగా ఈ బదిలీలు, నియామకాలు జరిగాయి. ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టిన కొత్త డీఇఓ, డీఆర్ఓలకు 'లాయర్' శుభాకాంక్షలు.

### 'రామాయణ కల్పవృక్షం'పై..

# ఆకట్టుకున్న ఉపన్యాసం



చెన్నైలోని వేదవిజ్ఞాన వేదిక ప్రతి నెలా నిర్వహించే 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహికలో భాగంగా 154వ ప్రసంగంగా 'విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం- పద్య శిల్పం'పై జరిగిన ఉపన్యాస కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈనెల 27న చెన్నై టీనగర్‌లోని ఆంధ్రక్లబ్-కృష్ణాహాల్ వేదికగా ఈ ఉపన్యాసం ఏర్పాటుచేశారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన డా. జోస్యుల కృష్ణబాబు వక్తగా పాల్గొని, ఆంధ్ర సాహితీజగత్తులో విశ్వనాథ వారి రచనలు విశిష్టస్థానాన్ని అలంకరించాయని, శతాధిక గ్రంథకర్త అయిన విశ్వనాథవారి రచనా నిర్మాణ శైలి అద్భుతమని వివరించారు. వారి రచనల్లో 'రామాయణ కల్పవృక్షం' ఒక అద్వితీయమైన రచన అని కొనియాడారు. అనంతరం, వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు డా. కృష్ణబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చెన్నైలోని అనేకమంది తెలుగు ప్రముఖులు, తెలుగుభాషాభిమానులు పాల్గొన్నారు.

# మనుచరిత్ర..ఒక మహాకావ్యం

సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ప్రథములైన అల్లసాని పెద్దన రచించిన మను చరిత్ర ఒక మహా కావ్యమని ఆచార్య టి.మాలకొండయ్య చెప్పారు. ఈనెల 27న నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం రీడింగ్‌హాల్‌లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన 'మనుచరిత్ర-అల్లసాని పెద్దన : జీవన మహా సందేశం' అనే అంశంపై ప్రసంగించారు. రాయల కాలం తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగమన్నారు. అనంతరం వక్తను ఘనంగా సన్మానించారు. పద్యకళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కవయిత్రి గోవిందరాజుల సుభద్రా దేవి, ఎన్.బలరామయ్యనాయుడు, శేషగిరీశం తదితరులు పాల్గొన్నారు. వీఆర్‌సీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం సభా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పంచాయతీ నిధుల్ని తినేశారు

## కలెక్టర్‌కి.. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి ఫిర్యాదు



వైకాపా పాలనలో కందుకూరు నియోజకవర్గంలోని పలు గ్రామపంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని, విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలెక్టర్ ఆనంద్‌కి ఫిర్యాదుచేశారు. వైకాపా సర్పంచ్‌లు గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే, అన్నీ చేసేసినట్లు ఎం-బుక్‌లలో రాయించుకుని నిధులు స్వాహా చేశారని ఆయన కలెక్టర్‌కి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వైకాపా వారి పాలనలో అసలు ఏమేం అభివృద్ధి పనులు జరిగాయి, ఎంత నిధులు కేటాయించారు, నిధుల దోపిడీ ఏమేరకు జరిగిందన్న విషయాలను తేల్చాలని, అక్రమాలకు పాల్పడ్డ అధికారులు, సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# గురుతర బాధ్యత..గురువులదే!

## - రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి



రేపటి ప్రపంచానికి నిపుణులైన మానవ వనరులను అందించేలా బాలల హక్కులను పరిరక్షించే ప్రధాన భూమిక ఉపాధ్యాయులదేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో బాలల హక్కులు అమలు జరుగుతున్న తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మానవ వనరులను నైపుణ్యంతో కూడిన మానవ వనరులుగా తీర్చిదిద్ది రేపటి ప్రపంచానికి అందించే గురుతర భాధ్యత ఉపాధ్యాయులదేనని, బాలల హక్కులను పరిరక్షించే ప్రధాన భూమిక వారిదేనని స్పష్టం చేశారు. పిల్లలను ఒత్తిడికి గురిచేయకుండా చదువుతోపాటు క్రీడలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత పెంపొందించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. మార్కులు తదితర విషయాల్లో పిల్లలను ఇతరులతో పోల్చకుండా కేవలం వారి వ్యక్తిగత సామర్థ్యాల మేరకు రాణించే విధంగా చూడాలన్నారు. చిన్న వయసులోనే చదువుల ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పిల్లలను చూస్తున్నామని, చదువంటే కేవలం ఇంజనీరు, డాక్టరు మాత్రమే కాదని, ఇతర అనేక రంగాల్లో మంచి మంచి అవకాశాలు ఉన్నాయని చిన్నవయసులోనే పిల్లలకు అవగాహన కలిగించాలని ఆమె సూచించారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్ల ప్రభావం పిల్లలపై అధికంగా ఉందని, దాంతో బాలికలపై అత్యాచార సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, అందువల్ల ఆ ప్రభావాలను గణనీయంగా తగ్గించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రసూతి, చిన్నపిల్లల విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను ఆమె పరిశీలించారు.

# ఇళ్ల మధ్య.. బ్రాందీ షాపులా?

## వెంటనే తొలగించాలంటూ సీపీఎం ర్యాలీ




నెల్లూరు నగరంలో ఇళ్ళ మధ్య ఏర్పాటుచేసిన బ్రాందీ షాపులను వెంటనే తొలగించాలంటూ సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఈనెల 26న పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి వీఆర్‌సీ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ, కొత్త మద్యం పాలసీ ద్వారా జనావాసాల మధ్య బ్రాందీ షాపులు ఏర్పాటుచేయడం దారుణమన్నారు. ప్రజలు వద్దన్నచోట కూడా వీటిని పెట్టడం అన్యాయమన్నారు. మద్యం షాపులు ఇళ్ళ మధ్యలో ఉండడం వల్ల ప్రజలకు ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇళ్ళు, గుళ్ళు, బళ్ళు, ప్రార్థనామందిరాలకు సమీపంలో బ్రాందీ షాపులు పెట్టడం తగదన్నారు. సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, చంద్రారెడ్డి, ప్రసాద్, ఫయాజ్, శ్రీనివాసులురెడ్డితో పాటు పలువురు మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు.

# టూకీగా...

## సైదాపురంలో.. వైభవంగా పోలేరమ్మ జాతర

మండల కేంద్రమైన సైదాపురంలో ఇటీవల గ్రామశక్తి శ్రీ పోలేరమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి పెద్దఎత్తున పూజలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చి జాతరలో పాల్గొన్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## బిట్రగుంటలో.. ఉపాధి హామీ పథకంపై సమీక్ష

బోగోలు మండలం బిట్రగుంటలో ఇటీవల ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని ఆధ్వర్యంలో ఏపీఓలు, సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ పథకం కింద కూలీలకు పనిదినాలు పెంచాలని, పనులు నాణ్యతగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. పథకం అమలులో అక్రమాలు జరిగితే సహించేది లేదని, కఠినచర్యలుంటాయని సిబ్బందిని హెచ్చరించారు.

## లేబూరు కుంకాళమ్మ ఆలయ అర్చకుడు కన్నుమూత

జిల్లాలో ప్రసిద్ధమైన గ్రామదేవత.. ఇందుకూరుపేట మండలం లేబూరు కుంకాళమ్మ ఆలయంలో అర్చకుడుగా ఉన్న పి.శ్రీనివాసులుశర్మ (58) అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. గ్రామస్తులు, స్థానిక ప్రముఖులు ఆయన మరణానికి విచారం వ్యక్తం చేశారు.

## జమ్మిపాలెంలో నదిలో పడి యువకుడు దుర్మరణం

చేపల వేటకోసం వెళ్ళిన ఆ యువకుడిని మృత్యువు కాటేసింది. కోవూరు మండలంలోని జమ్మిపాలెం వద్దనున్న పెన్నా నదిలో అక్టోబర్ 27న ఈ దుర్ఘటన జరిగింది. చేపల వేటకు వెళ్ళిన రాంబాబు అనే యువకుడు ప్రమాదవశాత్తూ నదిలో జారిపడి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాళ్ళపాడు కాలువల్లో పూడికతీత

గుర్రపుడెక్క, ముళ్ళచెట్లతో పూడిపోయిన రాళ్ళపాడు ప్రాజెక్టుకు సంబంధించిన కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఆయకట్టు రైతులకు ఈ కాలువల ద్వారా సాగునీళ్ళు వదలనుండడంతో, నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా ప్రాజెక్టు అధికారులు గత కొద్ది రోజులుగా కాలువలను శుభ్రం చేస్తున్నారు.

## ముత్తుకూరులో..మెగా రక్తదాన శిబిరం

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఇటీవల మండలకేంద్రమైన ముత్తుకూరులో మెగా రక్తదాన శిబిరం జరిగింది. 120 మంది రక్తదానం చేశారు. నోవా బ్లడ్‌బ్యాంక్ సహకారంతో, పోలీసు సిబ్బందితో పాటు స్థానిక యువకులు రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానమంటూ, రక్తదాతలందరినీ కృష్ణపట్నం సీఐ రవినాయక్ అభినందించారు.

## మానేగుంటపాడులో భూముల రీ-సర్వేలపై సభ

కొడవలూరు మండలంలోని మానేగుంటపాడులో ఇటీవల భూముల రీ-సర్వేలపై రైతులతో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో భూముల రికార్డుల్లో ఏమైనా మార్పుచేర్పులు చేయాల్సివుంటే రైతులు తమ దృష్టికి తీసుకువచ్చి, సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఆర్ఐ సునీల్‌రెడ్డి, సర్వేయర్ శ్రీలత పాల్గొన్నారు.

## నల్లరాజుపాళెం వద్ద ట్రాక్టర్ బోల్తా.. మెకానిక్ మృతి

అనంతసాగరం మండలం మినగల్లు పంచాయతీ నల్లరాజుపాళెం వద్ద ఇటీవల ఓ ట్రాక్టర్ అదుపుతప్పి ఉత్తరకాలువలో బోల్తాపడింది. ట్రాక్టర్‌ను మరమ్మతులు చేసి ట్రయల్‌రన్ కోసం దానిని నడుపుతున్న ఆత్మకూరుకు చెందిన మెకానిక్ సాధిక్ (47) దుర్మరణం పాలయ్యాడు. మృతదేహాన్ని వెలికితీసి అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాశ్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వంగల్లులో గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ

సంగం మండలం, వంగల్లు గ్రామంలోని గిరిజనకాలనీలో ఇటీవల గ్రామదేవతలైన శ్రీ పోలేరమ్మ, పోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఉభయకర్తలు పగడాల రఘురామయ్య, వారి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో గ్రామస్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# శ్రద్ధాంజలి



జననం: 18.01.1946 మరణం: 05.11.2017

స్నేహశీలి, మృదుస్వభావి,

మంచి మనసున్న మహామనీషి, మానవతావాది

## కీ॥శే॥ ఆదాల రాఘవరెడ్డి గారు

పరమపదించి తేది. 05.11.2024 నాటికి

ఏడేళ్ళు పూర్తికానున్న సందర్భంగా

ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
**ఆదాల అరుణ**

కుమార్తె
**ఆదాల సాయి అపర్ణ**

కుమారుడు - కోడలు
**ఆదాల వంశీకృష్ణ - రచన**

మనుమరాళ్ళు
**సాయి అనిక, సాయి అవని**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com